J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 11 16.08.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# జైల్లో.. కలిసుందాం రండి!

- తోడు వెతుక్కుంటున్న తోడు దొంగలు!
- కుయ్యో.. మొర్రో అంటున్న అయ్యా'ఎస్'లు!
- నాడు అధికారం.. నేడు కారాగారం!

**ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ అధికారుల పరిస్థితి అయోమయంగా, అగమ్యగోచరంగా తయారయ్యిందంటున్నారు రాజకీయ పరిశీలకులు. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు, అవినీతి గద్దల ఆగడాలకు తాము బలైపోయామని చాలామంది ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారని వారు చెప్తున్నారు.**

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు లేవు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి 2004లో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు తొమ్మిదిన్నర సంవత్సరాలు చంద్రబాబు రాష్ట్రాన్ని ఏలారు. అయితే రాజశేఖరరెడ్డి అధికారం చేపట్టాక తన కంటే ముందు రాష్ట్రాన్ని పరిపాలించిన బాబు పాలనపై ఎలాంటి దర్యాప్తులు జరపలేదు. బాబు హయాంలో ప్రభుత్వ విభాగాలలో పనిచేసిన అధికారులెవరూ అవినీతి ఆరోపణలతో జైళ్ల పాలు కాలేదు. ఆ తరువాత రాష్టంలో అనూహ్యమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. రాజశేఖరరెడ్డి 2009 సెప్టెంబర్2న హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారు. ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి తనని తాను రాజకీయ వారసుడిగా ప్రకటించుకుని ముఖ్యమంత్రి స్థానాన్ని కోరుకున్నారు. అయితే కాంగ్రెస్ అధిష్టానం అందుకు ఒప్పుకోలేదు. జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీ అధిష్టానంపై తిరగబడ్డారు. ఫలితంగా ఆయనపై కేసులు బనాయించబడ్డాయి. ఉమ్మడి రాష్ట్రంలో 2009–2014 మధ్యకాలంలో కాంగ్రెస్‌పార్టీయే అధికారంలో ఉండేది కాబట్టి, అంతకు ముందు 2004 నుండి 2009 వరకూ వై.ఎస్. జమానాలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదనలన్నిటికీ గంగిరెద్దులలా తలాడించి ఫైళ్లపై సంతకాలు చేసిన అధికారులంతా జగన్‌తో పాటు జైలుపాలయ్యారు.

ఆ తరువాత 2014లో రాష్ట్రం విడిపోవడం, కొత్త రాష్ట్రంలో ఐదేళ్ళపాటు, అంటే 2019 వరకూ

10లో

## గుండె నిండుగా.. జెండా పండుగ

### నింగిని తాకే సంబరంగా హర్‌ఘర్ తిరంగా

78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నెల్లూరులో అంబరాన్నంటాయి. గుండె నిండుగా జెండా పండుగ అందరిలో ఉత్సాహం నింపింది. 'హర్‌ఘర్ తిరంగా' కార్యక్రమం నింగిని తాకే సంబరంగా సాగింది.

3లో...





# ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు

## • పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి నారాయణ



ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రభుత్వం క్యాన్సర్ వ్యాధి నిర్ధారణకు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులో పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని, క్యాన్సర్‌పై అవగాహన కలిగించే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గొడవలు చేస్తే.. తాటతీస్తాం

## కందుకూరులో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్



కందుకూరు సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు పోలీసులు ఈనెల 12న కౌన్సిలింగ్ ఇచ్చారు. గొడవలు చేసినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు.. ప్రజల జీవితాలకు భంగం కలిగించినా తాటతీస్తామని హెచ్చరించారు. కొత్తగా వచ్చిన కందుకూరు సీఐ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలిగి మంచిగా జీవించాలని చెప్పారు. ఎస్ఐ ఆనందభాస్కర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్‌కు అంతరాయాలు లేకుండా చూడండి

## - అధికారులకు సీఎండి ఆదేశం



ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని ఆ సంస్థ సీఎండి కె సంతోష్ రావు అధికారులను ఆదేశించారు. ఇటీవల నెల్లూరులోని విద్యుత్‌భవన్‌లో అధికారులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పీఎం సూర్యఘర్ సౌరవిద్యుత్ వినియోగాన్ని పెంచాలని, అందుకు వినియోగదారుల్లో అవగాహన కలిగించాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్లు, విద్యుత్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



పెంచలకోన నృసింహస్వామికి..

# బంగారు గరుడోత్సవం

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం.. రాపూరు మండలం పెంచలకోనలో కొలువై ఉన్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఈనెల 11న స్వామివారి జన్మ నక్షత్రం.. స్వాతి నక్షత్రం సందర్భంగా అత్యంత వైభవంగా స్వామివారికి బంగారు గరుడోత్సవం నిర్వహించారు. పెంచలకోన మాడా వీధుల్లో పెద్దవత్తున జరిగిన ఈ ఉత్సవ ఊరేగింపులో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత, వేదపండితులు యాగశాలలో నృసింహహోమం చేసి, స్వామివారి మూలమూర్తికి అభిషేకం,చందనాలంకారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, శశిస్వామి, నాగరాజుస్వామి నేతృత్వంలో ఈ ఉత్సవాలు జరిగాయి. ఆలయ ఉప కమిషనర్ కవి సాగర్‌బాబు పర్యవేక్షించారు.

# అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు



విడవలూరు గ్రామదేవత అంకమ్మ తల్లికి ఈనెల 11న ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకారాలు చేసి, ప్రత్యేకపూజలు అభిషేకాలు చేశారు. రాత్రి పూలంగిసేవ వైభవంగా నిర్వహించారు. భక్తమండలి వాళ్ళు భజనలతో అమ్మవారి భక్తులను ఆకట్టుకున్నారు.

# సీఐలు, ఎస్ఐలకు బదిలీలు

ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి పలువురు సీఐలను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ ఇటీవల బదిలీ చేశారు. అదేవిధంగా నెల్లూరుజిల్లాలోని కొంతమంది ఎస్ఐలను జిల్లా ఎస్పీ కృష్ణతేజ బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నెల్లూరు సీఐడి విభాగంలో ఉన్న ఎన్ కిషోర్‌బాబును గూడూరు రూరల్ సర్కిల్‌కు, వెంకటగిరి సీఐ జి.సంగమేశ్వర రావును నాయుడుపేట రూరల్‌కు ఐజీ బదిలీచేశారు. ప్రకాశం జిల్లాలో ఎస్సీఎస్టీసెల్ విభాగంలో పనిచేస్తున్న సీఐ వెంకటరమణను వెంకటగిరి సర్కిల్‌కి, నెల్లూరు సీసీఎస్‌లో పనిచేస్తున్న ఇన్స్‌పెక్టర్ కె.సాంబశివరావును బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఒంగోలు సీఐడి విభాగంలో పనిచేస్తున్న మద్ది శ్రీనివాసరావును నెల్లూరు సంతపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

## ఎస్ఐలకు స్థాన చలనం :

జిల్లావ్యాప్తంగా పలువురు ఎస్ఐల బదిలీల్లో భాగంగా, జలదంకిలో ఉన్న ఎస్ఐ ఆదిలక్ష్మిని దుత్తలూరుకు, దుత్తలూరులో ఉన్న ఎం.ఉమాశంకర్‌ను కలిగిరికి బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఆదేశాలిచ్చారు. కలిగిరిలో ఉన్న సంతోష్‌రెడ్డిని నెల్లూరు విఆర్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా, బిట్రగుంటలో ఉన్న కె.భోజ్యను కొండాపురానికి, కొండాపురంలో ఉన్న మహేంద్రను నెల్లూరు విఆర్‌కు, సంగంలో ఉన్న నాగార్జునరెడ్డిని ఇందుకూరుపేటకు బదిలీ చేశారు. తోటపల్లిగూడూరులో ఉన్న జంపానికుమార్‌ను దగదర్తికి, దగదర్తిలో ఉన్న మరిడినాయుడును కందుకూరుకు, కందుకూరులో ఉన్న ఆనంద్‌భాస్కర్‌ను నెల్లూరు విఆర్‌కు పంపారు. వలేటివారిపాలెంలో ఉన్న బాలమహేంద్ర నాయక్‌ను కందుకూరు రూరల్‌కు, అక్కడ పనిచేస్తున్న పి.నరేష్‌ను విడవలూరుకు, విడవలూరులో ఉన్న ఎం.రాజాను నెల్లూరు విఆర్‌కు బదిలీ చేశారు. మర్రిపాడులో ఉన్న విశ్వనాథ్‌రెడ్డిని ముత్తుకూరుకు, నార్త్ ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న ఎం.శివశంకర్ రావును రాపూరుకు, రాపూరులో ఉన్న జె.మాల్యాద్రిని నెల్లూరు విఆర్‌కు బదిలీ చేశారు. అల్లూరు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డిని ఆత్మకూరుకు, ఆత్మకూరులో ఉన్న కె.ముత్యాలరావును నెల్లూరు విఆర్‌కు, చిన్నబజారు ఎస్ఐగా ఉన్న సైదులును ఏఎస్‌పేటకు, సీతారామపురంలో ఉన్న అనూషను సోమశిలకు, సోమశిలలో ఉన్న బి.సుబ్బారావును నెల్లూరు విఆర్‌కు, ఇందుకూరుపేటలో ఉన్న వీరేంద్రబాబును తోటపల్లి గూడూరుకు బదిలీచేశారు. బదిలీ అయినవారు వెంటనే ఆయా స్థానాల్లో విధుల్లో చేరాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

# యువతలో దేశభక్తిని పెంపొందించాలి




యువతలో దేశభక్తిని పెంపొందించాలని, జాతీయతా భావనలతో వారు ఎదిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 11న జలదంకిలో జరిగిన 'హర్ ఘర్ తిరంగా' బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేసిన స్వాతంత్ర్యసమర యోధులను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఆ మహనీయుల త్యాగనిరతితోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, వారిని స్ఫూర్తిగా తీసుకుని యువత దేశాభ్యున్నతికి నడుం బిగించాలని కోరారు. బీజేపీ మండల కన్వీనర్ శరత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ మధుమోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ మాలకొండారెడ్డి, నాయకులు వంటేరు రాకేష్, తిరుమలరెడ్డి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు.. 18 నుంచి



ఆకలై కొంగుపట్టేవారికి అన్నం పెట్టాలయ్యా!.. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలయ్యా!.. అంటూ తన మహనీయమైన బోధలతో మానవాళికి మానవతా విలువలు ప్రబోధం చేసిన సద్గురుదేవుడు..అవధూత, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి 42వ ఆరాధన మహోత్సవాలు ఈనెల 18నుంచి 24వ తేదీ వరకు గొలగమూడిలో అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ స్వామివారికి అత్యంత భక్తిశ్రద్ధలతో విశిష్ట పూజలు, విశేష సేవలు నిర్వహించనున్నారు. ఈ ఆరాధనోత్సవాలకు జిల్లా నుంచే కాక, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు లక్షలాదిగా తరలివస్తారు కనుక, ఆశ్రమ కమిటీవారు భక్తుల కోసం మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులందరికీ స్వామివారి ప్రసాదంగా నిత్యాన్నదానం ఉంటుంది. 18వ తేదీ వేకువన సుప్రభాతసేవ తర్వాత, రక్షాబంధనపూజ, దీక్షావస్త్ర సమర్పణ, దత్త సంప్రదాయ షోడశోపచార పూజలు, పతాక ఆరోహణలతో ఎంతో భక్తి శ్రద్ధలతో ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయి. అదేరోజు ఉదయం 10 గంటలకు స్వామివారికి సర్వభూపాల వాహనసేవ, రాత్రి 9 గంటలకు కల్పవృక్ష వాహనసేవ కన్నులపండువగా నిర్వహిస్తారు. అదేవిధంగా, 19న సూర్యప్రభ, చంద్రప్రభ వాహనసేవలు, 20న హనుమంతసేవ, హంసవాహనసేవ, 21న చిన శేషవాహనం, గజవాహనం, 22న అశ్వవాహనం, పెదశేషవాహనం, 23న సింహవాహనసేవ, గరుడ వాహనసేవ నేత్రపర్వంగా నిర్వహించనున్నారు. 24వ తేదీన శ్రీ వెంకయ్యస్వామివారి ఆరాధన మహోత్సవం మరింత వైభవంగా ఉంటుంది. ఆరోజు ఉదయం 9 గంటలకు సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఉదయం 10 గంటలకు రథోత్సవం, రాత్రి 8 గంటలకు తెప్ప మహోత్సవం వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఆశ్రమ కార్యనిర్వహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం నేతృత్వంలో, కమిటీ సభ్యులు, జిల్లా అధికారుల సారధ్యంలో స్వామివారి ఆరాధనోత్సవాలు అంగరంగవైభవంగా జరుగనున్నాయి.

అదాని పాఠశాల విద్యార్థినికి..

# 'తైక్వాండ్'లో బంగారు పతకాలు



ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో ఉన్న అదాని పాఠశాల విద్యార్థిని క్రీడా పోటీల్లో తన సత్తా చాటుకుంది. తాటిపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండ్ పోటీల్లో ఆ పాఠశాలకు చెందిన కృష్ణ విజిత అండర్-14 పోటీల్లో పాల్గొని వ్యక్తిగత విభాగంలోనూ, మిక్స్‌డ్ విభాగంలోనూ బంగారు పతకాలు సాధించి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సిరియాల సత్యనారాయణ తెలిపారు. ఇటీవల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థినిని అభినందించారు.

# ఐటిఐ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో రెండవ విడతలో మిగిలిన సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రభుత్వ బాలుర ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్నవారు తాము చేరదలచిన కళాశాలలో ఈనెల 27వ తేదీన తగిన ధృవపత్రాలతో హాజరై ధృవీకరించుకోవాలని తెలిపారు. 29వ తేదీన ప్రభుత్వ ఐటీఐలలోను, 30న ప్రైవేట్ ఐటీఐలలోను కౌన్సిలింగ్ జరుగుతుందని, వివరాలకు నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

# గుండె నిండుగా.. జెండా పండుగ



78వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జిల్లాలో అంబరాన్నంటే సంబరంగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా మువ్వన్నెల పతాక రెపరెపలాడింది. దేశస్వాతంత్ర్యం కోసం పోరుబాట పట్టి ప్రాణాలకెదురొడ్డి పోరాడిన స్వాతంత్ర్యసమరయోధుల వీరోచిత కార్యాలను, నాటి మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ జిల్లాలో అన్నిప్రాంతాల్లో జాతీయపతాకాన్ని ఎగురవేసి, గుండెనిండా ఎగిసే ఉత్సాహంతో జెండాకు వందనం చేశారు. జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోనూ జెండా పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక పోలీస్‌పెరేడ్ గ్రౌండ్స్‌లో పెదఎత్తున జరిగిన ఈ పండుగలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొని జాతీయపతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు. తొలుత, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌లు మంత్రిని సాదరంగా స్వాగతించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ, ఎందరో మహనీయుల త్యాగాలతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, ఆనాటి స్వాతంత్ర్యవీరులను, త్యాగధనులను ఎవరూ విస్మరించరాదని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం ప్రజలకోసం చేపడుతున్న సంక్షేమపథకాలను, రాష్ట్రాభ్యున్నతికి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక, రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందని, పేదల అభ్యున్నతికి బాటలు వేసే అనేక సంక్షేమపథకాలను అమలుచేస్తోందని మంత్రి వివరించారు. పారదర్శక పాలనకు పెద్దపీట వేస్తూ, ప్రజల సేవే పరమార్థంగా తాము పనిచేస్తున్నామని, జిల్లాకు, ప్రత్యేకించి నెల్లూరు నగరాభివృద్ధికి మరింతగా కృషిచేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న వివిధ శాఖల అధికారులకు స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా అవార్డులు బహుకరించారు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనపరుస్తున్న ఉద్యోగులను అభినందిస్తూ వారికి కూడా అవార్డులందించారు.

### ఆకట్టుకున్న.. చిన్నారుల కళాప్రదర్శనలు

స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో జిల్లాలోని అనేక పాఠశాలల విద్యార్థులు, బాలబాలికలు, కళాకారులు దేశభక్తితో ప్రదర్శించిన కళాప్రదర్శనలు అందరినీ అలరించాయి. చిన్నారుల భరతమాత, దేశనేతల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అధికారులు వివిధ శాఖలు చేపట్టిన అభివృద్ధి పనులను సూచిస్తూ రూపొందించిన శకటాలు తమ ప్రత్యేకతను చాటుకున్నాయి. ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. జిల్లాకు చెందిన అనేకమంది ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పెద్దసంఖ్యలో ఉద్యోగులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.









# 'వికసిత్ భారత్'లో.. యువత భాగస్వాములు కావాలి

## భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆకాంక్ష



నాటి స్వాతంత్ర్య సమరయోధులు కలలు గన్న విధంగా వికసిత్ భారత్ నిర్మాణంలో యువతరం భాగస్వాములు కావాలని భారత దేశ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వెంకటాచలంలోని అక్షర విద్యాలయంలో జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన స్వాతంత్ర్య సమరయోధుల స్మృతికి నివాళులర్పించారు. యువత నైపుణ్యాభివృద్ధితోనే నవభారత నిర్మాణం జరుగుతుందన్నారు. అందుకు యువత కృషిచేయాలని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆవిష్కరించే జెండా స్వేచ్ఛకు, ఆత్మగౌరవానికే గాక కోట్లాదిమంది భారతీయులు సంఘటితమై సాధించిన విజయానికి ప్రతీక అని ఆయన అభివర్ణించారు. తమ ప్రాణాలే పణంగా ఉద్యమించిన దేశభక్తుల త్యాగాల ఫలితమే స్వరాజ్యమని పేర్కొన్నారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు, నేతాజీ, అల్లూరి సీతారామరాజు, కొమురం భీమ్, చంద్రశేఖర్ ఆజాద్, కట్టబ్రహ్మన్న లాంటి ఎందరో మహనీయులు స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించారని అంటూ, అలాంటి త్యాగధనులను విస్మరించరాదన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవితాల గురించి యువత తెలుసుకోవాలని, తమ ప్రాంతాలకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రలను అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్ళవలసిన బాధ్యత యువతరం మీదే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్ట్ నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి, అక్షర విద్యాలయం ప్రిన్సిపల్ కుముద తదితరులు పాల్గొన్నారు.

# విశ్వసాయిలో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు



ఆగస్టు 15న 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని విశ్వసాయి కళాశాలలో సంబరాలు జరిగాయి. కళాశాల ఛైర్మన్ డా. ఎన్.సత్యనారాయణ పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేసి, పతాక వందనం గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి త్యాగధనుల కృషి ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించారు. విశ్వసాయి ఛైర్‌పర్సన్ ఎన్.రుక్మిణి, వైస్‌ఛైర్మన్ జి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్ఆర్ హైస్కూల్లో..




ఆగస్టు 15న 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అల్లూరు మండలం నార్తుమోపూరులో ఉన్న దేవిరెడ్డి శారద హైస్కూల్‌లో సంబరాలు జరిగాయి. అల్లూరు తహశీల్దారు ఏ.లక్ష్మీనారాయణ, ఎంపీడీవో వల్లభనేని జ్యోతి, ఎంఈఓ ఎస్.సునీత పాల్గొని మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. విద్యార్థినీ విద్యార్థుల నృత్యప్రదర్శనలు, పిరమిడ్ విన్యాసాలు అలరించాయి. దేవిరెడ్డి శారద ట్రస్ట్ ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, మేనేజర్ ఐ.అనిల్‌కుమార్‌రెడ్డి, హైస్కూల్ ప్రిన్సిపాల్ యమ్.శ్రీలతా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో...

నెల్లూరులోని రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లో రెడ్‌క్రాస్ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు డి.రవిప్రకాష్, జిల్లా కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, దాసరి రాజేంద్రప్రసాద్ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. విశ్వమాత ఫౌండేషన్ ప్రతినిధులు డి.కళ్యాణి, జయశ్రీ, రాధ, చుండూరు సుబ్రహ్మణ్యంల సహకారంతో పిల్లలకు పౌష్టికాహారాన్ని, పండ్లను పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 16న.. ప్రయోగానికి ఎస్ఎస్ఎల్వి-డీ3.. రెడీ



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ నెల 16న శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగకేంద్రం నుంచి ఎస్ఎస్ఎల్వి–డీ3 రాకెట్‌ను ప్రయోగించనుంది. ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. శుక్రవారం ఉదయం 9.17 గంటలకు రాకెట్ ప్రయోగం జరుగనుంది. ఈ రాకెట్ ద్వారా 175.5 కిలోల బరువున్న ఇఓఎస్–08 భూపరిశీలన ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నారు. షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి ఈ రాకెట్ ప్రయోగం జరగనుంది.

# నెల్లూరీయునికి రాష్ట్రపతి అవార్డు

## కర్నాటక అదనపు డీజీపీగా ఉన్న.. 'మువ్వా ఐపిఎస్'కి అరుదైన గౌరవం



కర్నాటక అదనపు డీజీపీగా పనిచేస్తున్న.. మన నెల్లూరీయులు.. మువ్వా చంద్రశేఖర్ పోలీసుశాఖలో ఉత్తమసేవలందిస్తూ ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన ఆ అవార్డును అందుకోనున్నారు. నెల్లూరుజిల్లా ఏఎస్‌పేట మండలం కొండమీదకొండూరు గ్రామానికి చెందిన మువ్వా బలరామయ్యనాయుడు – గంగా భవానిల కుమారుడే మువ్వా చంద్రశేఖర్. ఆయన ఖరగ్‌పూర్ ఐఐటీలో బీటెక్ పూర్తిచేశారు. ఇన్ఫోసిస్‌లో ఇంజనీర్‌గా ఉద్యోగప్రస్థానం మొదలుపెట్టి, ప్రజలకి సేవ చేయాలనే ఆసక్తితో సివిల్స్ రాసి, ఐపీఎస్‌కి ఎంపికయ్యారు. కర్నాటక పోలీసుశాఖలో పలు హోదాల్లో నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ.. ప్రజల మన్ననలు అందుకొని నేడు అత్యంత ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. మువ్వా చంద్రశేఖర్‌కి 'లాయర్' అభినందనలు.

# ఎన్‌బికెఆర్‌లో మువ్వన్నెల రెపరెపలు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆగస్టు 15 గురువారం నాడు స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ విద్యాసంస్థల అధినేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. స్వాతంత్ర్యసమరయోధుల త్యాగాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం క్రీడల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

లాయర్
ఆగస్టు 16, 2024

# గాలిలో దీపంలా..మన జలాశయాల భద్రత!

జీవజలాలు పుష్కలంగా ఉంటేనే మానవ మనుగడ. నీరే లేకుంటే పంటపొలాలు బీడుభూములే అవుతాయి. వానలు వరదలు వచ్చినప్పుడు ఆ జలం వృధా కాకుండా కాపాడుకోవడానికే జలాశయాలు.. వాటికి ఆనకట్టలు, గేట్లు వంటివన్నీ ఏర్పడ్డాయి. అయితే, దురదృష్టవశాత్తూ కేవలం మానవ తప్పిదాల వల్ల, ఎప్పుడూ జలకళతో కళకళలాడాల్సిన మన జలాశయాలకు భద్రత కరువవడం విచారకరం. రైతాంగానికి ప్రాణప్రదమైన డ్యామ్‌లు పటిష్టంగా లేకపోవడం ఘోరం!.. నిండుకుండలా ఉండాల్సిన జలాశయాలు, పెద్దపెద్ద నీటి ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం మూలంగా చేజేతులా మనం ఎంతో జలసంపదను కోల్పోతుండడం విచారకరం. లక్షలాది ఎకరాలకు సాగునీరందించే డ్యామ్‌ల గేట్లు తుప్పుపట్టి పోయినా పట్టించుకోని నిర్లక్ష్యపు ప్రభుత్వాలనేమనాలి? ఇటీవల తుంగభద్ర ఆనకట్ట గేటు కొట్టుకుపోవడం వంటి సంఘటనలు మన అలక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యాలు. నీటి ప్రవాహం ధాటికి కొట్టుకుపోయిన ఆ గేటును మళ్ళీ ఏర్పాటుచేసే లోపలే కనీసం 61 టీఎంసిల నీళ్ళు వృధాగా వెళ్ళిపోవడం, పంటపొలాలకు నీరు పెట్టుకోవాలని ఆశగా ఎదురుచూస్తున్న రైతాంగానికి ఎంత బాధాకరమో చెప్పలేం!..ఇది ఏ ఒక్కసారో కాదు. ఎన్నో సార్లు ఎన్నో డ్యామ్‌ల గేట్లు అలా కొట్టుకుపోతూనే ఉన్నా, మనవాళ్ళలో చలనం లేకపోవడం.. ఇలా డ్యామ్‌ల గేట్లు తరచూ కొట్టుకుపోవడం 'డ్యామ్ షేమ్' కాదా?.. ఆలోచించుకోవాల్సి ఉంది.

మనదేశంలో కనీసం ఆరువేలకు పైగానే పెద్దపెద్ద నీటి ప్రాజెక్టులు (డ్యామ్‌లు) ఉన్నట్లు గణాంకాలు చెప్తున్నాయి. అయితే, వాటిలో ఎన్ని సురక్షితంగా ఉన్నాయో చెప్పలేని పరిస్థితి. ఒక్క ఆంధ్రప్రదేశ్ సంగతి చూసుకున్నా, ఇటీవలే పలు జలాశయాలు గేట్లకు మరమ్మతులు లేక, ఏళ్ళ తరబడిగా ఉన్న ఆ గేట్లు ప్రవాహం ఉధృతికి కొట్టుకుపోయే పరిస్థితి దాపురించింది. పులిచింతల ప్రాజెక్టు 16వ గేటు 2021లో కొట్టుకుపోయింది. అదే ఏడాది కడప జిల్లాలో గేట్లు కాదు, ఒకేసారి అన్నమయ్య ప్రాజెక్టే కొట్టుకుపోయింది. గ్రామాలకు గ్రామాలు నీటి ప్రవాహానికి తుడిచిపెట్టుకుపోయాయి. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలకు ఉప్పొంగే తుంగభద్ర, కృష్ణా నదుల వరద నీటిని ఒడిసిపట్టుకుని నిల్వచేసుకుని పంటపొలాలకు అవసరమైనప్పుడు సాగునీరందించే ప్రాజెక్టులకు కూడా రక్షణ లేదు. అదునుకు పదునైన వానలు లేక, సాగునీటి కోసం తపించే పంటపొలాల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నకు జవాబుదారీ లేదు. వరదనీటి ప్రవాహాలకు డ్యామ్‌లు దెబ్బతినడం సహజం. అయితే, ఎప్పటికప్పుడు వాటిని మరమ్మతులు చేయించి, నీటి నిల్వలను కాపాడడం ప్రభుత్వాల కర్తవ్యం. కానీ పట్టించుకునే వారెవరు?..గత వైకాపా ప్రభుత్వమైతే, వాటి మరమ్మతుల జోలికే పోకపోవడంతో అనేక ప్రాజెక్టుల పరిస్థితి గాలిలోదీపంలా మారింది. కడప జిల్లాకు కృష్ణాజలాలను అందించే అవుకు రిజర్వాయర్ దీనస్థితిలో ఉన్నా, దానిని బాగుచేసేందుకు ప్రభుత్వం పైసా కూడా విదల్చకపోవడంతో దాని గేట్లు కూడా రేపోమాపో అన్నట్లుగా ఉన్నాయి. అదేవిధంగా, రాయలసీమకు నీరందించే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దెబ్బతిని చాలా కాలమైంది. దానిని కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు జలాశయం గేట్లు కూడా కాలక్రమేణా శిథిలావస్తకు చేరిపోయాయి. తుంగభద్రపై ఎప్పుడో బ్రిటీష్ వారి కాలంలో నిర్మించిన సుంకేశుల రిజర్వాయర్ పరిస్థితి అధ్వాన్నంగానే ఉంది. ఉభయగోదావరి జిల్లాలకు దాదాపు పది లక్షల ఎకరాలకు సాగునీరందించే ధవళేశ్వరం బ్యారేజీ గేట్లు తుప్పుపట్టిపోయి బొక్కలు బొరియలు పడి ఏళ్లు గడుస్తున్నా దిక్కు లేదు. కర్నూలు జిల్లాలో సుంకేశుల ప్రాజెక్టు, శ్రీశైలం ప్రాజెక్టు, కడప జిల్లాలోని మైలవరం ప్రాజెక్టుల గేట్లు అన్నీ మరమ్మతులు లేక ఎంతోకాలంగా ఏడుస్తూనే ఉన్నాయి. నెల్లూరుజిల్లాలోని సంగం వద్ద ఉన్న కనిగిరి జలాశయం, మరోవైపు సోమశిల డ్యామ్‌లు ఇటీవలికాలంలో వరదలకు దెబ్బతిన్నాయి కానీ, నేటికీ పూర్తిస్థాయిలో మరమ్మతులు లేవు. ఇలాచెప్పుకుంటూ పోతే రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న జలాశయాలు, నీటి ప్రాజెక్టుల జాబితా కొండవీటి చాంతాడంత ఉంటుంది. ఇకనైనా ఇటీవలే వచ్చిన కూటమి ప్రభుత్వమైనా వాటి లెక్క తేల్చాలి. ఎక్కడెక్కడ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయో సమగ్రమైన నివేదికలు తెప్పించుకుని వెంటనే నిధులిచ్చి వాటి బాగుకు యుద్ధప్రాతిపదికన సిద్ధం కావాలి. అందుకు అవసరమైతే కేంద్రప్రభుత్వం నుంచి కూడా సాయం అడగాలి. ఏదేమైనా సరే, అటు రైతన్నలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే మన జలాశయాలను పటిష్టం చేసుకోకుంటే, ఇంట్లో ఉన్న నీళ్ళకుండను చేతులారా పగులగొట్టుకున్నట్లే!...

## పొరుగున అనిశ్చితి... ప్రమాదకర పరిస్థితి!

మొన్న పాకిస్తాన్, నిన్న శ్రీలంక, నేడు బంగ్లాదేశ్... ఇలా మన భారతదేశానికి పొరుగున వున్న దేశాలలో ప్రజల తిరుగుబాటు మంచి పరిణామం కాదు. ఆ దేశాలలో వున్న అనిశ్చితి మన దేశాన్ని ప్రమాదకర పరిస్థితికి నెట్టే అవకాశం లేకపోలేదు. పక్క దేశాలలో జరుగుతున్న పరిణామాలని అధ్యయనంచేసి మన దేశంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. బంగ్లాదేశ్‌తో పాటు అనేక ఇతర దేశాలలో హిందువులపై జరుగుతున్న దాడులపై అంతర్జాతీయస్థాయిలో చర్చలు జరగాలి. – ప్రొ. విశ్వేశ్వరరావు, **హైదరాబాదు.**

## బెజవాడ గోపాలరెడ్డిని విస్మరించడం సిగ్గుచేటు!

పోయిన వారం మన 'లాయర్'లో "పెద్దాయనా క్షమించు" అంటూ రాసిన వార్త చూసి ఖంగుతిన్నాను. రాజకీయ నేతలూ ప్రభుత్వ అధికారులూ ఇద్దరూ డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి జయంతి, వర్ధంతులని పట్టించుకోవడం లేదని రాశారు. నిజంగానే ఇది సిగ్గుచేటైన విషయమే. నిబంధనల ప్రకారం చేయవలసిన పనులని కూడా లంచం తీసుకుని చేసే ప్రభుత్వ అధికారులని ఈ విషయంలో నేను తప్పు పట్టను. గోపాలరెడ్డి లాంటి నాయకుడిని విస్మరించడం నెల్లూరుజిల్లా రాజకీయ నాయకుల తప్పు. మచ్చలేని రాజకీయ నాయకుడిగా, నిరాడంబరతకి మారుపేరుగా ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన గోపాలరెడ్డిని చూసి ఈ తరం నాయకులు నేర్చుకోవలసింది చాలావుంది. ఆయన నుండి స్ఫూర్తిని పొందాల్సిన వారు ఆయనని పూర్తిగా మర్చిపోవడం దురదృష్టకరమే కాదు, నేటితరం నాయకుల నిర్లక్ష్య ధోరణికి అది నిదర్శనం కూడా. పదిమందికీ విద్యాబుద్ధులు చెప్పే నారాయణ, సీనియర్ రాజకీయ నాయకుడు ఆనం రామనారాయణ ప్రస్తుతం మంత్రులుగా ఉన్నారు. వాళ్లిద్దరైనా స్పందించి నగర కార్పొరేషన్ అధికారులు శాశ్వతంగా పెద్దాయన జయంతి వర్ధంతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. పాత తరం నాయకులు రేపటి తరానికి స్ఫూర్తిదాయకులు కావాలంటూ కేవలం వారి విగ్రహాలు పెట్టి వదిలేస్తే సరిపోదు, అప్పుడప్పుడు వారిని స్మరించుకుని వారి గొప్పదనాన్ని గురించి చెప్పుకుంటేనే ఆ విగ్రహాలకు సార్థకత. – ఆర్.దయాకరరెడ్డి, **నెల్లూరు.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

## రేట్లు పెంచేసిన సెల్‌ఫోన్ కంపెనీలు!

సెల్‌ఫోన్.. ఇప్పుడు మనిషి జీవితంలో ఓ భాగమైపోయింది. జనం జేబులో పైసా డబ్బులు లేకుండానైనా ఇంట్లోంచి బయటకి వెళ్తున్నారేమో కానీ, సెల్‌ఫోన్ చేతులో లేకుండా అడుగు బయటపెట్టడంలేదు. ఇటీవల మన నెల్లూరబ్బాయి ఒకడు సెల్‌ఫోన్ మూలాంశంగా "మాయా పేటిక" అనే ఒక సినిమా కూడా తీసి చేతులు కాల్చుకున్నాడు. జనం బలహీనతని సెల్‌ఫోన్ నెట్వర్క్ సంస్థలు కూడా అవకాశంగా తీసుకుంటున్నాయి. తాజాగా తమ ఇష్టానుసారంగా ధరలు పెంచేశాయి. వ్యాపార దిగ్గజం రిలయన్స్ ముందుగా తమ టారిఫ్ పెంచుతున్నట్లుగా ప్రకటించింది. మిగిలిన సంస్థలు కూడా అదే బాట పట్టాయి. అవసరాన్ని అవకాశంగా మార్చుకోవడం అంటే ఇదేకదా! అవసరం జనానిది, అవకాశం వ్యాపార సంస్థలది!!

డి.హరిత, **గూడూరు.**




# కృత్రిమ ప్రేమలతో.. కుటుంబ వ్యవస్థ!

## రక్షాబంధన్(రాఖి)

ఆగస్టు 19న రాఖీ పండుగ వస్తోంది.

మా సోదరుడు క్షేమంగా ఉండాలి.

ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వందేళ్లు తాను జీవించాలి... అంటూ సోదరి రక్ష కడుతుంది.

మా ఇంటి ఆడపడుచు బాగుండాలి, ఎప్పుడూ నవ్వుతూ నా ఎదురుగా ఉండాలి, ఆమెకు ఎలాంటి కష్టం రాకూడదు, ఆమె కంట నీరు కనపడకూడదు, అన్ని సమయాల్లో ఆమెకు నేను రక్షగా ఉంటాను... అంటూ... సోదరుడు తన సోదరిని ఆశీర్వదించి కానుక ఇస్తాడు.

అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల పవిత్ర బంధాన్ని అపురూప రక్తసంబంధంగా జన్మజన్మల అనుబంధంగా సూచిస్తూ సమాజానికి సందేశాన్నిచ్చేదే "రాఖీ" పండుగ.

శ్రావణమాసంలో వచ్చే నిండు పౌర్ణమి రోజు (ఈ ఏడాది ఆగస్టు 19)న ప్రపంచవ్యాప్తంగా వున్న భారతీయ సమాజం "రక్షాబంధన్" వేడుకగా జరుపుకుంటుంది.

అక్కచెల్లెళ్ళు తమ అన్నదమ్ములకి 'రాఖీ' కడతారు. అన్నదమ్ములు తమ స్థాయిని బట్టి కానుకలిచ్చి అక్కచెల్లెళ్లని ఆనందపరుస్తారు.

ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాలలో పాటు సామాజిక మాధ్యమాల ప్రాధాన్యత పెరిగిన తరువాత రక్షాబంధన్ బహుళ ప్రాచుర్యాన్ని పొంది ప్రత్యేకతని సంతరించుకుంది.

ఉత్తర భారతదేశంలో పురుడుపోసుకున్న 'రాఖీ' సంప్రదాయం క్రమేణా దక్షిణభారతదేశంలో కూడా వ్యాపించి ప్రాముఖ్యతని పొందింది.

## పబ్లిసిటీ స్టంటుగా మారింది!

ఇప్పుడు ఈ పండుగ కూడా ప్రచారార్భాటంగా తయారయ్యింది. కృత్రిమ ప్రేమాభిమానాలకి వేదికై పబ్లిసిటీ స్టంటుగా మారింది.

ప్రధాని నుండి ముఖ్యమంత్రుల వరకూ తమ సహచర మంత్రివర్గ సభ్యులు, ఎంపీలు, ఏంఎల్ఏలు ఇతర పార్టీ శ్రేణుల చేత రాఖీ కట్టించుకుని మీడియాకి ఫోజులు ఇస్తున్నారు.

వాట్సాప్‌లు, ట్విట్టర్‌లు, ఫేస్‌బుక్కులు, ఇన్‌స్టాగ్రాములలో పోస్టింగులు పెట్టడానికి అవసరమైన ఫోటోల కోసం పాకులాడుతున్నారు.

వారందరిలో నిష్కల్మషమైన అన్నాచెల్లెళ్ళు, అక్కా తమ్ముళ్ల బంధం ఎంతమందిలో ఉంటుందో అనుమానమే...? వాళ్ళే కాదు, పేదా గొప్పా అన్న తేడా లేకుండా ఎన్నో కుటుంబాలలో ఇదే తంతు.

ఒక్క రాఖీ పండుగ రోజు మాత్రం ప్రేమానుబంధాలు వొలకబోసుకునే చాలామంది సోదరసోదరీమణులు మిగిలిన రోజులలో ఎడమొహం పెడమొహంగా ఉంటున్నారు.

నిజానికి చాలా కుటుంబాలలో అన్నాచెల్లెళ్ల బంధాలు ఆస్తులు, అంతస్తులు, అధికారం, అహంకారం చుట్టూ తిరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ తాజా మాజీ ముఖ్యమంత్రి కుటుంబమే అందుకు పెద్ద ఉదాహరణ.

ఇంటి పెద్ద జీవించినంత కాలం ప్రజలచేత ఆరాధింపబడిన "రాజ" కుటుంబం ఆ తరువాత ఏ విధంగా రచ్చకెక్కిందో మనం చూస్తూనే ఉన్నాం. అన్నాచెల్లెళ్ళు ఒకరిని ఒకరు ఎలా దుమ్మెత్తి పోసుకుంటున్నారో గమనిస్తూనే ఉన్నాం.

## వేల రకాల రాఖీలు!

సోదరుడికి రక్షగా సోదరి ఒక చిన్న పసుపు దారం కట్టినా అది రక్షే, కానీ ఈ ఆధునిక సమాజం అలా లేదు. కొనేవారి స్థాయిని బట్టి రాఖీలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. పది రూపాయల నుండి పది లక్షల వరకూ కూడా రాఖీలు లభిస్తున్నాయి.

సామాన్యులు తమ ప్రేమని పదిరూపాయల దారంతో చూపిస్తే, ధనికులు తమ డాబు, స్థోమత ప్రదర్శించుకోవడానికి లక్షలు ఖర్చుపెడుతున్నారు. తమ సోదరిలకి సోదరులు ఇచ్చే కానుకలు కూడా ఆర్థిక స్థితిని బట్టే ఉంటున్నాయి.

ఏడాదికి ఒక్కరోజు వచ్చే రక్షాబంధన్ కోసం లక్షలు ఖర్చుపెడుతున్నారు.

## పరిస్థితులు మారాలి!

సోదరసోదరీమణులు ఒకరి నుండి ఒకరు కోరుకోవలసింది ఏడాదికి ఒక్కరోజు అక్కచెల్లెళ్ళు కట్టే రాఖీలనో లేక అన్నదమ్ముళ్లు ఇచ్చే కానుకలనో కాదు. ఒక తల్లి కడుపున పుట్టినందుకు కష్టాల్లో సుఖాల్లో ఒకరికొకరు జీవితాంతం అండగా ఉండాలి. ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలిగినా మేమున్నాం అన్న భరోసా కల్పించాలి.

తల్లితండ్రులు లేని సోదరసోదరీమణులు వాళ్లే ఒకరికొకరు అమ్మా నాన్నలు కావాలి. తాము ఒకరిపై ఒకరు చూపించుకునే ప్రేమాభిమానాలే వారి పిల్లలకి కూడా అలవడతాయి.

పాత తరంలో మేనమామ అంటే తండ్రితో సమానమని, మేనత్త అంటే తల్లితో సమానమని మన పెద్దలు చెప్పేవాళ్ళు. అత్యాధునిక ఇంటర్నెట్ యుగంలో భార్యాభర్తలు కూడా ఒకరితో ఒకరు సరిగ్గా మాట్లాడుకునే పరిస్థితులు లేవు. పుట్టినరోజునాడో లేక పెళ్లిరోజు నాడో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. ఆ ఒక్కరోజు మాత్రం ఒకరిపై ఒకరు ప్రేమలు కురిపించుకుంటున్నారు. మిగిలిన రోజులలో యాంత్రిక జీవనమే.

తమ పెళ్ళిళ్లకి ముందు అక్క, చెల్లి అని దగ్గర తీసే అన్నదమ్ములు, అలాగే అన్నయ్యా, తమ్ముడూ అంటూ ఆప్యాయంగా పిలిచే అక్క చెల్లెళ్ళు... వాళ్ల పెళ్లిళ్లు కాగానే మారిపోతున్నారు. మేము-మా జీవితం అన్నట్లుగా స్వార్థపరులైపోతున్నారు.

తీవ్రమైన పనివత్తిడితో సతమవుతున్న యువత ఆలోచనా విధానం వల్ల కుటుంబవ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైపోతోంది. ఫాథర్స్ డే, మదర్స్ డేలతో పాటు ఈ రక్షాబంధన్ వంటి రోజులు వచ్చి ప్రేమాభిమానాలని ఒక్క రోజుకే పరిమితం చేసేశాయి. సమాజంలో 80శాతానికి పైగా కుటుంబాలు ఇదే తరహాలో జీవిస్తున్నాయి.

ఇదే సంప్రదాయం, సంస్కృతి మరికొన్నేళ్లు కొనసాగితే బంధుప్రీతి అన్నది పూర్తిగా మాయమై మానవసంబంధాలు కనుమరుగయ్యే ప్రమాదముంది!

ఆగస్టు 19న రక్షాబంధన్ సందర్భంగా కృత్రిమ ప్రేమని పంచుకోబోతున్న అక్కచెల్లెళ్లకి, అన్నదమ్ములకి ఈ వ్యాసం అంకితం..!

- రాజశ్రీ

## మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసేది...

# భావితరాలకు స్ఫూర్తి కలిగించేందుకే!

### గూడూరులో శ్యామసుందర్‌రెడ్డి-రాధాకృష్ణారెడ్డిల విగ్రహావిష్కరణలో మన వెంకయ్య



విగ్రహాల ఏర్పాటు పరమార్థం...వారి స్ఫూర్తిని అందిపుచ్చుకోవటమేనని, ఆ మహనీయుల జీవితాన్ని ముందు తరాల వారు తెలుసుకుని, వారి స్ఫూర్తితో సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావటమేనని భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి మన వెంకయ్యానాయుడు చెప్పారు. ఈనెల 9న ఆయన గూడూరులోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల ఆవరణంలో ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శులు ఏ.శ్యామసుందర్‌రెడ్డి, డాక్టర్ సి.రాధా కృష్ణారెడ్డిల విగ్రహాలను, డాక్టర్ సిఆర్ రెడ్డి జీవిత విశేషాలను తెలియజేసే 'మహనీయ మూర్తి డాక్టర్ సిఆర్ రెడ్డి' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్పతనం అనేది సంపాదించటంలో ఉండదని, దాన్ని సద్వినియోగం చేసుకోవటంలోనే ఉంటుందని, సంపద పెంచుకోవటంతో పాటు, మన సంపాదనలో కొంతభాగాన్ని సమాజానికి పంచడంలోనే నిజమైన ఆనందం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

### ఆ మిత్రద్వయం స్ఫూర్తి.. భావితరారలకు ఆదర్శం :

గూడూరులాంటి ఊర్లో ఆ రోజుల్లోనే ఓ మహిళా కళాశాల నెలకొల్పాలన్న ఈ మిత్రద్వయం స్ఫూర్తి ముందుతరాలకు ఆదర్శనీయమన్నారు. 1981లో కేవలం 56 మంది విద్యార్థులు, ఆరుగురు ఉపాధ్యాయులతో ప్రారంభమైన కళాశాల నేడు మార్గదర్శకమైన స్థితిలో ఉండటం ఆనందదాయకమన్నారు. అల్లారెడ్డి శ్యామసుందర రెడ్డి వ్యాపారదక్షత ప్రశంసనీయమని, వారి పట్టుదల, క్రమశిక్షణ, కార్యదీక్షతో పాటు వారి నిరడంబరతను ఈతరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బంగారానికి తావి అబ్బినట్లు శ్యామసుందర్‌రెడ్డికి, సీఆర్‌రెడ్డి మిత్రునిగా లభించటం, వాళ్ళిద్దరి సారధ్యంలో వారి మానస పుత్రికగా ఈ కళాశాలను ప్రారంభించడం.. వారి క్రాంతదర్శనానికి నిదర్శనమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా బావి, చెరువు, వనం, మండపం, చలివేంద్రం, రావిచెట్టు, పుత్రుడు అనే పెద్దలు వివరించిన సప్త సంతానాల గొప్పతనం గురించి ఆయన వివరించారు. సంతానం అంటే నలుగురికీ సేవ చేయటమనే విషయాన్ని శ్యాంసుందర్‌రెడ్డి గుర్తించి వారి మేనమామ, మేనత్తలకు నిజమైన సంతానంగా ఈ కళాశాల స్థాపన ద్వారా చిరస్థాయిగా నిలిచారన్నారు. యువత వారి జీవితాల నుంచి విజయాలను కాక, విజయం కోసం పడిన శ్రమను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గూడూరు శాసనసభ్యులు డా. పాశం సునీల్‌కుమార్, అఖిలభారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు ఆచార్య సీఎంకె రెడ్డి, దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల అధ్యక్షులు ఎం.శివకుమార్‌రెడ్డి, సెక్రటరీ-కరస్పాండెంట్ డా. కె.మెహర్ మణి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు యూనిఫామ్‌లో మార్పులు

- కొత్త క్యాప్, బెల్టు, లోగో ఆవిష్కరణ



రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ ప్రతిపాదనలతో వివిధ శాఖల్లో పని చేస్తున్న పోలీసు సిబ్బంది యూనిఫామ్ ప్యాటర్న్‌లో మార్పులు చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. ఎస్‌పిఎఫ్, కానిస్టేబుళ్ళు, హెడ్‌కానిస్టేబుళ్ళ క్యాప్, బెల్ట్, ఎస్‌పిఎస్ సిబ్బంది లోగోల్లో మార్పులు చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రత్యక రక్షణ దళం డైరెక్టర్ జనరల్ డా.సి.ఎం త్రివిక్రమవర్మ, ఏపీ ఎస్‌పీఎఫ్ ఐజీ బివి రామిరెడ్డి వాటిని ఆవిష్కరించారు. ఏపీఎస్‌పిఎఫ్ విజయవాడ జోన్ కమాండెంట్ ఎం.శంకరరావు, అసిస్టెంట్ కమాండెంట్ పివిఎస్ఎన్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో మెగా రక్తదాన శిబిరం



శ్రీసిటీ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల శ్రీసిటీలోని మూడు వేర్వేరు ప్రదేశాల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్, శ్రీసిటీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ట్రేడ్ సెంటర్, బిజినెస్ సెంటర్, ఈఎంసి కేంద్రం వద్ద శిబిరాలు ఏర్పాటుచేశారు. యాక్సలెంట్ ఫార్మా, బ్రేక్స్ ఇండియా, ఇసుజు, నిట్టాన్ ఇండియా, రాకవర్త్, వెర్మీరిన్, టిల్, ఈ-ప్యాక్ సహా 40 పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు, సూళ్ళూరుపేట గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాల, సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు మొత్తంగా 500మందికిపైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, రక్తదానం బాధితుల ప్రాణాలను కాపాడుతుందని, అలాంటి విశిష్టమైన రక్తదాన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన రక్త దాతలను ఆయన అభినందించారు. నెల్లూరు జీఎస్టీ కమిషనరేట్ సూపరింటెండెంట్ సునీల్ గౌతమ్, రక్తదాన శిబిరం విజయవంతం చేసేందుకు కృషి చేసిన శ్రీసిటీ యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు.

## కాణిపాకంలో

# దీపమ్మ పూజలు



పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి కుమార్తె, స్వర్ణభారత్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ దీపమ్మ (దీపా వెంకట్)తో పాటు ఆమె కుటుంబసభ్యులు ఇటీవల కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవాలయాన్ని సందర్శించి గణనాధునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఏఇఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ రాజగోపురం వద్ద వారిని సాదరంగా స్వాగతించి దైవదర్శనం చేయించారు. పూజల అనంతరం వారికి స్వామి వారి శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ మాజీ ఛైర్మెన్ మణినాయుడు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్స్‌పెక్టర్ రవి పాల్గొన్నారు.



## నెల్లూరుకు వస్తే..

# పుట్టింటికి వచ్చినట్టే!

### డయాలసిస్ కేంద్ర ప్రారంభోత్సవంలో మంత్రి సత్య ఆనందం

నెల్లూరుసీమ పోరాటాల గడ్డ అని, తన రాజకీయ జీవితం ఇక్కడనుంచే ప్రారంభమైందని, తానిక్కడ ఎన్నో విషయాలను నేర్చుకున్నానని, అందుకే నెల్లూరుకు వస్తే తనకు పుట్టింటికి వచ్చినంత ఆనందంగా ఉంటుందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి పదవి చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా ఈనెల 9న నెల్లూరుకువచ్చి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలసి పెద్దాసుపత్రి (ప్రభుత్వ వైద్యశాల)లో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లాలోని కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం పినాకిని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 'బయ్యా సరోజనమ్మ' పేరుతో ఈ డయాలసిస్ కేంద్రం ఏర్పాటైంది. ప్రముఖ దాతలు బయ్యా రవి, బయ్యా వాసు సహకారంతో ఈ కేంద్రం ఏర్పాటు కావడం అభినందనీయమని మంత్రి సత్యకుమార్ కొనియాడారు. జిల్లాలో డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు ఇదేవిధంగా దాతలు, స్వచ్ఛంధంగా ముందుకు రావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. వింజమూరు, పొదలకూరులో కూడా డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు కోరారని, వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సిద్ధానాయక్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి, డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, డీసీ హెచ్‌ఎస్ రమేష్‌నాథ్, డెప్యూటి సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా పాల్గొన్నారు. అనంతరం, వైద్యాధికారులతో సమావేశమాయ్యరు. వైద్యులు బాధ్యతగా ప్రజలకు సేవలందించాలన్నారు. పెద్దాసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు, వైద్య కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మంత్రి పొంగూరు నారాయణతో కలసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.


## ఆసుపత్రుల్లోని సమస్యలు తీర్చండి

**- సత్యకుమార్‌కు.. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వినతి -**



రాష్ట వైద్యారోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నెల్లూరులోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి, కోవూరు నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించి నూతన భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనకై మంత్రికి విజ్ఞాపనపత్రం అందజేశారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని 30 పడకల కమ్యూనిటి హెల్త్ సెంటర్‌ను రూ.2.5 కోట్ల వ్యయంతో ఆధునీకరించి సెంట్రల్ ఆక్సిజన్ పైప్‌లైన్, పోస్ట్‌మార్టం గది నిర్మాణం, డెంటల్ ఎక్స్‌రే మిషన్, 50 కేవీ జనరేటర్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. శిధిలావస్థకు చేరిన కోవూరు కమ్యూనిటి హెల్త్ సెంటర్, మైపాడు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని ప్రశాంతిరెడ్డి మంత్రిని కోరారు.



















# రత్నంవారిపల్లెలో.. రోషిణి - ఈశ్వర్‌ల పెళ్లి

ఆగష్టు 09, 2024 శుక్రవారం నాడు నెల్లూరు వీపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఓ కొత్త పల్లె ఆవిర్భవించింది.

ఆ ప్రాంగణంలోని ఆధునిక హంగులన్నీ మాయమై అత్యంత సాంప్రదాయమైన పల్లెటూరు అక్కడ అవతరించింది.

నెల్లూరు చరిత్రలో ఇప్పటివరకూ కనీవినీ ఎరుగని తరహాలో ముస్తాబైన ఆ గ్రామం దివంగత రత్నం మాష్టారు - శ్రీమతి పద్మావతమ్మల మనుమరాలు డాక్టర్ కృష్ణకిషోర్ - వాసంతిల ఏకైక కుమార్తె **రోషిణి - ఈశ్వర్**ల పెళ్ళికి వేదికయ్యింది. ఈ కళ్యాణ వైభోగానికి హాజరైన అతిథులని, అతిరథ మహారథులని రత్నం - అంబికా కుటుంబాల బంధుమిత్ర సపరివారాన్ని ఆ అద్భుత కళాత్మక గ్రామం అబ్బురపరిచింది. రత్నంవారిపల్లెగా అందరినోటా కీర్తించబడింది.

ఆ సాయంత్రం జరిగిన బారాత్ కార్యక్రమంతో కాబోయే జంట రోషిణి - ఈశ్వర్‌లు "రత్నంవారిపల్లె"కి చేరుకున్నారు. అనంతరం 6.30 గంటల నుండి 8.30 వరకూ వధూవరుల పరిచయ కార్యక్రమం జరిగింది.

రాత్రి 9.45 నుండి 11.00లలోగా రోషిణి - ఈశ్వర్‌లు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య ముక్కోటి దేవతల సాక్షిగా ఆలూమగలయ్యారు.

అంగరంగ వైభవంగా, ఆనందోత్సవ సంబరంగా జరిగిన ఈ పెళ్ళి వేడుకలో రాజకీయ, పారిశ్రామిక, విద్య, వైద్య, వ్యాపార రంగాల ప్రముఖులతో పాటు ఇంకా ఇతర విభాగాలకి చెందిన పలువురు ముఖ్యులు పాల్గొని వధూవరులని దీవించారు. రోషిణి - ఈశ్వర్ జంటని ఆశీర్వదించిన వారిలో భారతదేశ 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు-ఉషమ్మ దంపతులు, వారి కుమార్తె దీప, మంత్రులు పొంగూరు నారాయణ, వై.సత్యకుమార్, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కామినేని శ్రీనివాస్, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, శాసనమండలి సభ్యుడు బల్లి కళ్యాణ్ చక్రవర్తిలతోపాటు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, పరసా రత్నం, కిలివేటి సంజీవయ్య, శ్రీసిటీ వ్యవస్థాపకులు రవి సన్నారెడ్డి, అమెరికాలో ప్రముఖ హృద్రోగవైద్యులు డాక్టర్ కేశవరామిరెడ్డి, నామా నాగేశ్వరరావు సోదరులు తదితరులున్నారు.

అగష్టు 11వ తేదీ వరుడి స్వస్థలం ఏలూరులో జరిగిన ఈశ్వర్-రోషిణిల రిసెప్షన్ సంబరంలో ఈశ్వర్ తాతయ్యలు అంబికా కృష్ణ, అంబికా ప్రసాద్, అంబికా రాజా, నానమ్మ సత్యమాల, ఈశ్వర్ నాన్న అంబికా రామాంజనేయులు, అమ్మ అంబికా జానకి పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విద్యాసంస్థల అధినేతలు, పార్లమెంటు సభ్యుడు పుట్టా మహేష్, శాసనసభ్యులు రాధాకృష్ణయ్య, ధర్మరాజు, జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్(నెల్లూరుజిల్లా ఆత్మకూరు వాస్తవ్యులు)లతో పాటు వివిధ రంగాలకి చెందిన అనేకమంది ప్రముఖులు ఈ రిసెప్షన్‌లో పాల్గొని కొత్త జంటకి తమ ఆశీస్సులు అందించారు. రోషణి - ఈశ్వర్‌లకు 'లాయర్' శుభదీవెనలు!












# నెల్లూరు కబుర్లు

## జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా

### జడ్పీ సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి



జిల్లా అభివృద్ధే తొలి ప్రాధాన్యతగా పనిచేస్తానని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్) చెప్పారు. ఇటీవల నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డాక్టర్ పొంగూరు నారాయణలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విపిఆర్‌ను, ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ దంపతులు ఘనంగా సన్మానించారు. విపిఆర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం కొలువు తీరాక జరిగిన తొలి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, పార్లమెంట్ సభ్యుడిగా నెల్లూరుజిల్లా అభివృద్ధికి ఎలాంటి సహకారం కావాలన్నా.. తాను ముందుంటానని తెలిపారు. కేంద్రంలో జిల్లాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు సహకారం అందిస్తామన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కావలి, వెంకటగిరి ఎమ్మెల్యేలు దగుమాటి కృష్ణారెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు సమావేశంలో పాల్గొని జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు.

## కొత్త జాయింట్ కలెక్టర్



నెల్లూరు జిల్లాకు కొత్త జాయింట్ కలెక్టర్ (జేసీ)గా విజయనగరం జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ నియమితులయ్యారు. ఆయన 2020 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందినవారు. తాజాగా రాష్ట్రప్రభుత్వం ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా, కార్తీక్‌ను నెల్లూరు జేసీగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. కొత్త జేసీకి 'లాయర్' శుభాభినందనలు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవికి లక్షకుంకుమార్చన



నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా లక్షకుంకుమార్చన నిర్వహించారు. తొలుత, అమ్మవారిని పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి కుంకుమార్చన చేశారు. పెద్దసంఖ్యలో మహిళా భక్తులు పూజలో పాల్గొన్నారు. ఆలయ ఛైర్మెన్ రత్నం జయరామ్, సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు.

## ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్.. 17న రాక



భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఈనెల 17వ తేదీన నెల్లూరు జిల్లాలో పర్యటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేది ఉదయం 10.30 గంటలకు ఆయన ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా నెల్లూరులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంటారని, అక్కడనుండి బయలుదేరి 10.50గంటలకు వెంకటాచలంలోని అక్షర విద్యాలయానికి చేరుకుని అక్షర విద్యాలయంలోను, స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఏర్పాటుచేసిన వివిధ కార్యక్రమాల్లో ఉపరాష్ట్రపతి పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 2.55కు తిరిగి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌కు చేరుకుని, రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్తారని తెలిపారు.

### చిన్నస్థాయి నుంచి..

## ఉన్నతమైన స్థానానికి ఎదిగిన సత్య

### జనసేన నాయకుడు నూనె మల్లికార్జునయాదవ్ ప్రశంస



చిన్నతనం నుండి కష్టపడి ఉన్నత చదువులను చదువుకుని, నేడు మంత్రిగా ఉన్నతమైన స్థాయికి సత్యకుమార్ ఎదగటం అభినందనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను నెల్లూరులోని జనసేన పార్టీ సీనియర్ నేత, కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున్‌యాదవ్ కొనియాడారు. ఇటీవల నెల్లూరుకు వచ్చిన మంత్రి సత్యకుమార్‌ను ఆయన స్థానిక పెద్దాసుపత్రిలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లికార్జునయాదవ్ మాట్లాడుతూ, మధ్యతరగతి కుటుంబానికి చెందిన సత్యకుమార్ స్వయంకృషితో, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించడం హర్షణీయమన్నారు. నెల్లూరు నుంచే రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన సత్య, నెల్లూరు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తారని ఆయన అంటూ, భవిష్యత్తులో కూడా సత్య మరిన్ని ఉన్నత పదవులను పొందాలని ఆకాంక్షించారు. తొలుత, మంత్రి సత్యకుమార్‌ను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జమీర్, గునుకుల కిషోర్, కృష్ణారెడ్డి, రవి, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన లీగల్ సెల్ కార్యాలయం



నెల్లూరులో జనసేన లీగల్‌సెల్ కార్యాలయం ప్రారంభమైంది. స్థానిక రమేష్‌రెడ్డినగర్ వద్ద జనసేన లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది చదలవాడ రాజేష్ ఆధ్వర్యంలో ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. జిల్లాలో జనసేన కార్యకర్తలకు న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు వచ్చినా లీగల్‌సెల్ అండగా ఉండి, వారి సమస్యలను పరిష్కరిస్తుందని రాజేష్ ఈ సందర్భంగా తెలిపారు. సీనియర్ న్యాయవాదులు తిరుపతి వెంకటేశ్వరరావు, తంజావూరు శ్రీనివాసరావు, కందికట్లు శిఖివాహన, ఎస్ శ్రీరాములు, లక్ష్మీనారాయణ, నెల్లూరు బార్ జాయింట్ సెక్రటరీ వరప్రసాదరావుతో పాటు పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.



## తండ్రీ కొడుకులతో.. శ్రీధర్‌రెడ్డి భేటీ



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లను గౌరవ పూర్వకంగా కలుసుకున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.

## నారాయణ నివాసంలో.. శ్రావణ మాసం పూజలు



శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా నెల్లూరులోని మంత్రి నారాయణ దంపతులు తమ నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. అనంతరం, శ్రావణ మాసం శుభ సందర్భంగా సుమారు 400 మంది మహిళలకు చీరలతోపాటు..పసుపు కుంకుమలు అందచేశారు. నారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### శ్రీకృష్ణ జన్మాష్టమికి..

## ఇస్కాన్‌లో విశేష పూజలు



ఆగస్టు 26న శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని, నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో విశేష పూజలు జరుగనున్నాయి. అందుకోసం ఆశ్రమ నిర్వాహకుల ఆధ్వర్యంలో మందిరాన్ని శోభాయమానంగా అలంకరించడమే కాక, ఉత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆగస్టు 16 నుంచి 19వ తేదీ వరకు ప్రతిరోజూ రాత్రి శ్రీ రాధాకృష్ణులకు ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. ఆగస్టు 19న బలరామ జయంతి వేడుకలను ఆరోజు సాయంత్రం 6.15 నుంచి రాత్రి 9గంటల వరకు నిర్వహించనున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదిన ఉత్సవం ఆగస్టు 26వతేదీ ఉదయం 8 నుంచి ప్రారంభమై అర్ధరాత్రి 12.30 వరకు జరుగనుంది. ఆగస్టు 27న శ్రీల ప్రభుపాద వ్యాసపూజ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుంది, సెప్టెంబరు 11న శ్రీ రాధాష్టమిని పురస్కరించుకుని సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు విశేషపూజలు సేవలు ఉంటాయని, భక్తులు ఈ ఉత్సవాలన్నిటిలో పాల్గొని స్వామివార్ల కృపాకటాక్షాలను పొందాలని మందిరం అధ్యక్షులు శుకదేవస్వామి కోరారు.






## వ్యాధి నిరోధక టీకాలుపై శిక్షణ

వ్యాధి నిరోధక టీకాలు వేయడంపై వైద్యారోగ్య సిబ్బందికి, సంబంధిత సూపర్‌వైజర్లు తదితరులకు ఈ నెల 13న నెల్లూరులోని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. నెల్లూరు, ఆత్మకూరు, కందుకూరు, కావలి డివిజన్లలోని వైద్యాధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డీఎల్ఏటీఓ డాక్టర్ ఖాదర్ వలి, జిల్లా వ్యాధినిరోధక టీకాలు అధికారిణి డాక్టర్ ఏ.ఉమామహేశ్వరి, ప్రపంచ ఆరోగ్యసంస్థ సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోనిక సిప్టీ థామస్ తదితరులు ఆ టీకాలు ప్రాధాన్యతను సిబ్బందికి వివరించారు.

## రంగనాథుని కోవెలలో పవిత్రోత్సవాలు

నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో ఈనెల 13 నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో కొలువైవున్న శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ రంగనాథస్వామివార్లకు ఈ సందర్భంగా విశేష అలంకారాలు, విశిష్ట పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19వ తేదీ దాకా నిత్యహోమాలు, గోపురోత్సవం తదితర ప్రత్యేకపూజలు, సేవలు నిర్వహిస్తున్నారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ఇఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, జిల్లా దేవాదాయశాఖ అధికారి జె.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు వేలూరు శ్రీనివాసులు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

# ఆటలకు ఆర్థిక దన్ను అవసరం



145 కోట్ల మందితో ప్రపంచంలోనే ఎక్కువ జనాభా ఉన్న దేశంగా ఉన్న మన దేశం పారిస్ ఒలింపిక్స్ పతకాల్లో మాత్రం వెనకబడింది. 32 క్రీడల్లో పోటీ జరగ్గా 16 క్రీడల్లో 117 మంది భారత క్రీడాకారులు పోటీ పడ్డారు. సాధించిన పతకాలు 6. పతకాల సాధనలో మన దేశం ర్యాంకు 71. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందన్న అంచనాలున్నాయి. చదువుల్లో, అంకురపరిశ్రమలు స్థాపించి విజయ పథంలో నడిపించడంతో పాటు వివిధ రంగాల్లో దూసుకెళ్తున్న మన దేశం క్రీడల్లో ఎందుకు వెనకబడుతోంది అనేది కూలంకషంగా చర్చించు కోవాల్సిన, పరిష్కారం కనుక్కోవాల్సిన విషయం. ఒక అశ్వనీ నాచప్ప బయోపిక్ చూసినప్పుడో, ఒక పీటీ ఉష పట్టుదల గురించి విన్న ప్పుడో, ఒక దంగల్ సినిమా చూసినప్పుడో, ఒక సైనా నెహ్వాల్, ఒక పీవీసింధు తల్లిదండ్రుల త్యాగం గురించి విన్నప్పుడో మనలో వీరావేశం పొంగు కొస్తుంది. మన పిల్లలందరినీ క్రీడారత్నాలుగా మార్చి వెలుగులు విర జిమ్మాలని పట్టుదల పొంగుకొస్తుంది. కానీ అది పాలపొంగులా చప్పున చల్లారిపోతుంది. ఎందుకంటే నిత్యం బతుకుపోరాటంలోనే అలసిపోయే మధ్యతరగతి కుటుంబాలకు పిల్లలకు క్రీడాశిక్షణ ఇప్పించడం తలకు మించిన భారమే. పెట్టిన ఖర్చుకు తగిన ప్రతిఫలం భవిష్యత్తులో వస్తుందో రాదో తెలియదు. అదే చదువులపై దృష్టిపెడితే చిన్నదో, పెద్దదో ఏదో ఒక ఉద్యోగం వస్తుందనే భరోసా వారిలో ఉంది. ఇది మన దేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వాస్తవ పరిస్థితి. మరోవైపు ఆటల వైపు మొగ్గుచూపే వర్గం ఉన్నా అందులో క్రికెట్‌కే అగ్రతాంబూలం. శభాష్, శభాష్, బాల్ రే అన్న మాటలు తప్ప మైదానంలో వేరే మాటలు వినపడని క్రికెట్, వ్యాఖ్యాతల ఉత్సాహభరితమైన వాక్ప్రవాహం, హోరెత్తించే అభిమానుల కేరింతలు, 360 డిగ్రీల కెమేరా ఎఫెక్టులతో బుల్లితెరలో చేసే ప్రసారం వల్ల ఇంటింటి ఆటగా మారిపోయింది. వీధుల్లోనో, ఇంటి చుట్టుపక్కల మైదానాల్లోనో టెన్నిస్ బాల్, బ్యాట్‌లతో చెలరేగిపోయే పక్కింటి కుర్రాళ్లు ఐపీఎల్ వచ్చాక అవకాశాలు పెరిగి సూపర్ స్టార్లుగా రాణిస్తున్నారు. క్రికెట్‌లో వచ్చే ఆదాయం ఎక్కువ కావడంతో ఈ ఆటకు బాగా ప్రోత్సాహం లభిస్తోంది.

క్రీడలు అనేవి మునుపటిలా కేవలం ఆయా వ్యక్తుల మానసిక ఉల్లా సానికి పరిమితమయిన వ్యవహారం కాదు. అంతర్జాతీయంగా ఒక దేశ ప్రతిష్ఠను పెంచే విషయమయింది. అంతే కాదు... క్రీడలు ఒక పరిశ్రమగా రూపాంతరం చెందాయి. క్రికెట్‌నే ఉదాహరణగా తీసుకుంటే దాని చుట్టూ కొన్ని వేల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోంది. ఫలితంగా ఆటగాళ్లకే కాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి దొరుకుతోంది. క్రీడలు ఇప్పుడు ఆర్థిక వ్యవస్థలో భాగం. భారత క్రికెట్ మండలి (బీసీసీఐ) 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో రూ.2,038.55 కోట్లు జీఎస్టీ చెల్లించింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి దాదాపు రూ.7,600 కోట్ల ఆదాయాన్ని సంపాదించింది. ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ బోర్డు బీసీసీఐ. మరి క్రికెట్ లో సాధించిన ఈ విజయాన్ని మిగిలిన క్రీడల్లో ఎందుకు సాధించలేకపోతున్నాం? క్రికెట్‌కు పుట్టిల్లు అయిన ఇంగ్లాండ్‌నే ఆటలో కానీ, ఆర్జనలో కానీ ఎలా దాటగలిగాం? ఎలాగంటే కాలానుగుణంగా మారుతూ ఆ ఆట పట్ల ప్రజల్లో విపరీతమైన ఆసక్తి కలిగించడం వల్ల. ఆటగాళ్లకు మంచి ప్రతిఫలం ఇవ్వడం వల్ల. కపిల్ సేన 1983లో ప్రపంచ క్రికెట్ కప్‌ను గెల్చుకున్న ప్పుడు వారికిచ్చిన పారితోషకం చాలా తక్కువ. ఇప్పుడు స్టార్ ఆటగాళ్లు రూ.వందల కోట్లకు అధిపతులవుతున్నారు. క్రికెట్‌కు క్రమబద్ధంగా అంతటి ఆదరణను తీసుకొచ్చారు. మిగిలిన క్రీడలకూ అలా చేయవచ్చు. దానికన్నా ముందు మన బలాలు, బలహీనతలపై అంచనాకు రావాలి. ఏ ఆటల్లో సంప్రదాయంగా మనం రాటుదేలామో బేరీజు వేసుకుని ఆ ఆటలపై తొలుత బాగా దృష్టిపెట్టాలి. ఉదాహరణకు కుస్తీ, కబడ్డీ, విలువిద్య తదితర పోటీల్లో మనం తరతరాలుగా అలవాటు పడి ఉన్నాం. ఇన్డోర్ అయితే చదరంగాన్ని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ముందు ఇలాంటి ఆటలను గుర్తించి వాటిపై ఎక్కువగా దృష్టి సారించాలి. శిక్షణ, మౌలిక వసతులను వ్యవస్థీకృతం చేయాలి. మట్టిలోని మాణిక్యాలను వెలికితీసి వారిని ప్రోత్సహించాలి. ముఖ్యంగా ఖర్చు విషయంలో వారు ఆందోళన చెందే పరిస్థితి రాకూడదు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ వ్యవస్థను నడిపించాలి. రాష్ట్రాలను నోడల్ కేంద్రాలుగా చేస్తూ ప్రత్యేక క్రీడా వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ఈ వ్యవస్థలు దేశ, రాష్ట్ర, జిల్లాస్థాయి క్రీడా సంఘాలతో సమన్వయం చేసుకుంటూ ఏడాది పొడవునా పోటీలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రస్తుతం ప్రభుత్వ అకాడమీలు లేదంటే ప్రైవేటు అకాడమీలు పని చేస్తున్నాయి. ప్రభుత్వ అకాడమీల్లో పర్యవేక్షణ లోపం, నాణ్యత లోపం కనిపిస్తుంటే, ప్రైవేటు అకాడమీలు మధ్యతరగతి, పేద వర్గాల క్రీడాకారులకు అందనంత దూరంలో ఉన్నాయి. అందుకే ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రత్యేక క్రీడా వ్యవస్థలు ఏర్పాటు కావాల్సిన అవసరం ఉంది.

మరో ముఖ్యమైన విషయం ఆధిపత్య ధోరణి. మన సంస్కృతిలో అణకువ అంతర్భాగంగా ఉంటుంది. కానీ కొన్ని ఇతర దేశాల క్రీడాకారుల్లో ఆధిపత్య ధోరణి కనిపిస్తుంది. దీనివల్ల కచ్చితంగా గెలిచి తీరతారనుకున్న మన క్రీడాకారులు కీలక సమయాల్లో వెనకబడడం చూస్తున్నాం. గతంతో పోలిస్తే ఇప్పుడు మన క్రీడాకారుల్లో చాలామార్పు వచ్చింది. చైనా, ఇండో నేషియా బ్యాడ్మింటన్ ఆటగాళ్ల ఆధిపత్యానికి మన ఆటగాళ్లు ఆత్మవిశ్వా సంతో అడ్డుకట్ట వేయగలిగారు. ఇది మా సంస్కృతి అని చెప్పుకుంటూ ఆస్ట్రేలియా క్రికెట్ ఆటగాళ్లు చేసే స్లెడ్జింగ్‌కు గంగూలీ నుంచి ప్రతిఘటన ఎదురయింది. అప్పటినుంచి మన క్రికెటర్ల దూకుడు పెరిగింది. అంటే ఆటల్లో కేవలం శారీరక బలం, నైపుణ్యమే కాకుండా, మానసిక స్థైర్యం అవసరం అని రుజువవుతోంది. వ్యవస్థాగతంగా చేసే మార్పుల్లో ఈ విషయాన్ని కూడా గమనంలోకి తీసుకోవాలి. అంతర్జాతీయంగా ఎక్కువ ఆటల పోటీల్లో నిబంధనలు పాశ్చాత్య దేశాలకు అనుగుణంగా ఉంటాయి. వారు అంగీకరించక పోయినా ఇది వాస్తవం. నిబంధనల రూపకల్పన లోనూ మన వాణి గట్టిగా వినిపించాలి. మొత్తం మీద బహుముఖ వ్యూహంతో పాటు ఆర్థిక కోణాన్ని కూడా జతచేస్తే దేశంలో క్రీడా సంస్కృతి మరింత పెరిగి అంతర్జాతీయంగా గట్టి పోటీ ఇవ్వగలుగుతాం.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**






**నా**యనా నీలాంటివాడినే ప్రవాసానికి పంపుతున్నాడనిన రాజంటే అందరికీ భయం కలుగుతుంది! నీవుకూడా అరణ్యానికి వెళ్ళవలసి వస్తున్నదంటే దైవమే బలవత్తరమైనది అని చెప్పవచ్చును!

నాయనా! లేగదూడ పోతుంటే తల్లి అక్కడే చూస్తూ నిలబడి ఉం టుందా? నేను కూడా నీ వెంటే వస్తాను తండ్రీ! అని కడు దీనంగా హృదయవిదారకంగా విలపిస్తున్న తల్లిని ఓదార్చిన రాముడు, అమ్మా! కైకమ్మ వంచనకు గురై విలవిలలాడుతున్న నా తండ్రిని ఈ సమయంలో ఒంటరిగా వదిలేస్తావా! నేనూ వెళ్ళి, నీవూ ఆయనను విడిచిపెడితే ఇంక ఆయనకు దిక్కెవరమ్మా?

అయినా! ఏ స్త్రీ కూడా భర్తను పరిత్యజించరాదు! అది చాలా క్రూరమైన పని తల్లీ! భర్త జీవించి ఉన్నంత వరకు భార్య ఆయనతోనే ఉండి సేవచేయవలె! ఇదే శాశ్వతమైన ధర్మం

అమ్మా! భరతుడు ధర్మాత్ముడు ! అన్నిప్రాణులకు ప్రియం గూర్చేవాడు! అతడు నీకు అనుకూలంగా ఉంటాడమ్మా! నీకు బెంగవద్దు! అని పరిపరివిధాలుగా తల్లిని ఓదార్చాడు రాముడు.

అప్పుడు కౌసల్య కాస్త స్తిమితపడి, రామా! నీ మార్గములు మంగళ కరములగుగాక! సకలప్రాణికోటి నిన్ను ఆదరించుగాక, దిక్పాలకులు, సకలదేవతలు, త్రిమూర్తులు, స్థావరజంగమాత్మకమైన ఈ ప్రకృతి నిన్ను కాపాడుగాక అని దీవించి పంపింది.

రాముడు అటనుండి తన ఇంటికి పాదచారియై వెళ్లాడు. జరిగిన విషయాలేవీ భార్యకు తెలియదు. తన ప్రాణేశ్వరి, తన ప్రియసతి సీతను చూడగనే కట్టలుతెంచుకుంటూ దుఃఖము పొంగిపొరలి పైకితన్నుకుంటూ ఉబికిఉబికి వచ్చింది రామచంద్రునికి!

**తం శోకం రాఘవః సోఢుం తతో వివృతతాం గతః!.**

భర్తయొక్క ఈ రూపం వింతగా ఉంది సీతకు. తనకు మొదట తెలిసిన రాముడు వీరమూర్తి, తరువాత శృంగారమూర్తి, ఇంట్లో శాంతమూర్తి! వీరశృంగారం, శాంతవీరం కలబోసిన దివ్యచైతన్యదీప్తి! నేడేమిటి? దీనమూర్తి అయినాడు?

ఆవిడ మనస్సులో సందేహం పొడసూపింది.

రాఘవా! ఏరి వందిమాగధులు? ఏది భద్రగజము! ఏవి సకల రాజలాంఛనాలు? ఏల నీవు పాదచారివై సంచరిస్తున్నావు?

ఇన్ని ప్రశ్నలను ఆవిడ చూపులు సంధించాయి !... ఉండబట్టలేక అడిగేసింది సీత! ఏమి కారణం రామభద్రా! నీ విచారానికి!

ఆయన దుఃఖము చెలియలికట్ట దాటిన సంద్రమే అయింది! మెల్లగా తనను తాను సమాధానపరచుకొని, సీతా! తండ్రిగారు నన్ను అరణ్యాలకు పంపివేయుచున్నాడు, అని పలికాడు.

మా తండ్రి పూర్వం తనకిచ్చిన రెండువరాలను మా తల్లి కైక నేడు కోరుకుంది, దాని ప్రకారం నేను పదునాలుగేండ్లు వనవాసం చేయవలె, నా బదులుగా భరతునకు పట్టముగట్టవలె!

అందుచేత అరణ్యవాసానికి బయలుదేరిన నేను నిన్ను చూసి, నీకు చెప్పి వెళదామని వచ్చాను!... అని అన్నాడు రాముడు.

సీతా నీవు ధైర్యంగా ఉండు, నీవు దైవధ్యానంలో ఉండి ఈ పదు నాలుగేండ్లు వ్రతాలు, ఉపవాసాలతో కాలం గడుపు! నా తల్లులను, తండ్రిని ఇప్పటివలెనే ఆదరించాలి సుమా! భరత,శత్రుఘ్నులను సోదరుల వలే, పుత్రులవలే చూసుకోవాలి నీవు.

విశేషించి భరతుడు రాజ్యానికి సర్వాధికారి, అతనికి అనిష్టము చేయగూడదు.

రాముడి మాటలు వింటున్న సీతమ్మ మనస్సులో...

ఓ నా పిచ్చి రాఘవా! అనుకుంది.

ప్రేమ పెల్లుబికి వచ్చింది! అదే ప్రేమతో కూడిన కోపంతో, ఈ మాటలు అనడానికి సిగ్గు అనిపించడంలేదా? వినడానికి నాకే సిగ్గుగా ఉంది. ఎవరి పుణ్యపాపాలను వారే అనుభవిస్తారు!

ఒక్క భార్య మాత్రమే భర్తయొక్క భాగ్యాన్ని పంచుకొంటుంది! భార్యాభర్తల భాగ్యమొక్కటే!

నిన్ను అడవికి వెళ్ళమంటే నన్నూ వెళ్లమన్నట్లే!

**నారీణామ్ పతిరేకో గతిఃసదా!....**

స్త్రీలకు భర్త ఒక్కడే ఉత్తమ గతి!..

నీ ప్రయాణం దుర్గమారణ్యములైతే నీ ముందు నడచి నీ మార్గంలో కంటకములు ఏరివేసి నీవు సుఖంగా నడిచేటట్లు చేస్తాను.

ఈ విషయంలో నీ మాట నేను మన్నించను.

మేడల మీదా, మిద్దెల మీదా నివాసం కన్నా భర్తతో కలసి ఉం డటంలోనే ఆనందముంది!.

రామా! నా తల్లిదండ్రులు అనేకమైన విషయాలలో నేనెలా నడచు కోవాలో నాకు ముందే ఉపదేశించి ఉన్నారు. నేడెవ్వరూ చెప్పవలసిన పనిలేదు. నీవు నాతోడు ఉంటే నాకు వేరే బ్రతుకెందుకయ్యా! అడవి అయినా, అయోధ్యా నగరి అయినా నీతోటే నాజీవితం.

అడవి నాకు నా పుట్టిల్లు లాంటిది.

సకలజీవ సంరక్షకా రామా! అడవిలో నన్ను నీవు రక్షించుకోలేవా?

రామా! మా మిథిలలో ఉన్నప్పుడు ఒక భిక్షుకి నాకు వనవాస మున్నట్లుగా ఎరుక చెప్పింది. ఒక బ్రాహ్మణుడు కూడా అదే విషయం నాకు చెప్పినాడు! అంతే కాకుండా నాకు కూడా అడవులలో సంచరిం చాలనే కోరిక ఉంది.

నీతో చెట్టాపట్టాలేసుకుని చెట్టూచేమా, ఏరులు, సరస్సులలో విహారం చేయాలని ఉంది, విరగబూసిన కమలాలతో నిండిన సరస్సులలో మనోహరంగా తిరుగాడే హంసలను, కారండవపక్షులను నీ చేతిలో చేయివేసి కూర్చుని ఆనందంగా వీక్షించాలని ఉంది.

మనోహరమైన ప్రకృతిలో నీతో కలిసి లక్ష సంవత్సరాలైనా ఆనం దంగా జీవించగలను రామా! అని ఎంతో ఉత్సాహంగా పలుకుతున్న సీతమాటలకు రాముడు అడ్డువచ్చాడు!

సీతా! అరణ్యమంటే ఆషామాషీ కాదు!

భయంకరమైన సింహగర్జనలతో వనమంతా ప్రతిధ్వనిస్తూ ఉం టుంది, మత్తెక్కి క్రీడించే క్రూరమృగాలు మనుషులను చూడగనే మీద మీదికి దూకుతుంటాయి, నదులన్నీ మొసళ్ళు, బురదతో నిండి దాటటానికి శక్యం కాకుండా ఉంటాయి. దారులన్నీ డొంకలతోటి, ముళ్ళతోటి నిండి ఉంటాయి, అడవికోళ్ళ అరుపులు వినపడుతుంటాయి.

నీరు దొరకదు. పగలంతా శ్రమపడి రాత్రివేళ ఆకులుపరచుకొని ఆ పక్కలపై పడుకోవాల్సి ఉంటుంది. కందమూలాలు తవ్వుకొని తినాల్సి ఉంటుంది.

..(సశేషం)



# శ్రీసిటీలో తిరుపతి కలెక్టర్, ఎస్పీ

తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఈనెల 9న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీలో మొదటిసారి సందర్శనకు వచ్చిన జిల్లా ఉన్నతాధికారులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పారిశ్రామికవాడ ప్రగతి, ప్రత్యేకతలను వారికి వివరించారు. అనంతరం ఈ నెల 19న శ్రీసిటీకి రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు.

# జైల్లో... కలిసుందాం రండి!

(మొదటిపేజీ తరువాయి)

మళ్ళీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా కొనసాగడం జరిగాయి. ఆ తరువాత మళ్ళీ 2019లో 151 సీట్లతో జగన్‌మోహన్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టి 2024 వరకూ ముఖ్యమంత్రిగా కొనసాగారు. ముప్పై సంవత్సరాలు తానే ముఖ్యమంత్రిగా ఉంటానన్న ధీమాతో అయిదేళ్ళ పాటు తనదైన స్టైల్‌లో పరిపాలన సాగించారు. నీకు ఐదేళ్ళే ఎక్కువన్నట్లుగా తాజా ఎన్నికలలో ప్రజలు 11సీట్లు మాత్రమే ఇచ్చి, ప్రతిపక్షహోదా కూడా లేకుండా చేసి జగన్‌ని తాడేపల్లి – బెంగళూరుమధ్య తిప్పుతున్నారు. ఇది అందరికీ తెలిసిన చరిత్ర.

అయితే, ఇక్కడ ఒక విషయాన్ని జాగ్రత్తగా గమనించాలంటున్నారు పరిశీలకులు. రాజశేఖరరెడ్డి, ఆ తరువాత రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి వీళ్ళెవరూ కూడా చంద్రబాబు హయాంలో పనిచేసిన అధికారులపై దర్యాప్తుకి ఆదేశించలేదు, చర్యలకి పూనుకోలేదు. జగన్‌మోహన్‌రెడ్డి తన అయిదేళ్ళ పాలనలో కూడా చంద్రబాబు పాలనలో పనిచేసిన ఒక్క అధికారిని కూడా అవినీతి ఆరోపణలతో జైలుకి పంపలేదు. బాబు ప్రభుత్వంలో ఇంటిలిజెన్స్ డీజీగా పనిచేసిన ఒక్క ఏ.బి.వెంకటేశ్వరరావుని మాత్రం ముప్పతిప్పలు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పారు. కానీ, తెలుగుదేశం పార్టీ పాలనలో మంత్రులుగా పనిచేసిన వారిని, పార్టీశ్రేణుల్ని అచ్చెన్నాయుడితో సహా ఆ పార్టీ నాయకులని అరెస్టు చేయించి జైలు ఊచలు లెక్కపెట్టించారు. తన నాన్న హయాంలో తాను చెప్పిన మాట విని తనకి జైల్లో కంపెనీ ఇచ్చిన అధికారులని మాత్రం తన ప్రభుత్వంలో అందలం ఎక్కించారు. మొన్నటివరకూ మునిసిపల్ శాఖలో ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేసిన శ్రీలక్ష్మియే ఇందుకు పెద్ద ఉదాహరణ. ఇలా వినయ విధేయ జగనా అంటూ పనిచేసేవాళ్ళని చాలామందినే ఆయన తన అధికారసైన్యంగా నియమించుకున్నారు.

ఇప్పుడు ఒక్కొక్కరి భాగోతాలు బయటపడుతున్నాయి. మద్యం, మైనింగ్, రెవెన్యూ, దేవాదాయ, విద్య, వైద్య, పరిశ్రమలు, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, సమాచార శాఖ, టీటీడీ... ఇలా అవినీతికి కాదేదీ అనర్హం అన్నట్లుగా అన్ని విభాగాలలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. గనుల ఘనుడు వెంకటరెడ్డి, మద్యం మరాఠీ వాసుదేవరెడ్డి ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అయ్యా ఎస్ అన్న చాలామంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పోస్టింగులు రాక, రిలీవ్ కాలేక సతమతమై పోతున్నారు.

జగన్, సజ్జల, సాయిరెడ్డి, పెద్దిరెడ్డిలతో పాటు జగన్ సమీప బంధువులు చెప్పిన పనులన్నీ చేసి ఇప్పుడు నాలుక కరుచుకుంటున్నారని పరిశీలకులు చెప్తున్నారు. వారిపై మమకారంతో తమ సహకారాన్ని అందించి అధికారాన్ని దుర్వినియోగం చేసినందుకు ఇప్పుడు వారితోపాటు తాము కూడా కారాగారానికి వెళ్లాల్సి వస్తుందని లబోదిబోమంటు న్నారని అధికారవర్గాల సమాచారం. తోడుదొంగలంతా ఒక్కటై ఇప్పటినుండే జైల్లో తమకి తోడు వెతుక్కుంటున్నారని చెప్తున్నారు. ఒకరికొకరు ఫోన్‌లు చేసుకుని అందరం కలిసికట్టుగా అప్రూవర్లుగా మారిపోదామని, అప్పుడు అందరమూ ఒకేసారి రాజమండ్రిలో ఉండొచ్చని కొంతమంది అధికారులు ప్రతిపాదిస్తున్నారని కూడా వార్తలు వస్తున్నాయి.

ముప్పైఏళ్ళు జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రిగా ఉంటారని, అప్పటికి తాము రిటైర్ అయిపోవచ్చులే అనే ధీమాతో కళ్ళు మూసుకుని సంతకాలు పెట్టమని చెప్తూ, ఇప్పుడు బాబొచ్చి తమ చాపకిందకు నీళ్ళొచ్చాయని కుయ్యో మొర్రో అంటున్నారని రాజకీయ పరిశీలకుల సమాచారం.

మొత్తంమీద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విభాగాలలో గత ప్రభుత్వ నిర్ణయాలపై రాజముద్ర వేసిన అధికారులపై పెద్ద చర్చే నడుస్తోందని అంటున్నారు. పద్నాలుగున్నర సంవత్సరాలు పాలనా అనుభవం ఉన్న బాబు రాజ్యంలో తాము తప్పించుకోవడం అసాధ్యమే అన్న భయంతో చాలామంది అధికారులు వణికిపోతున్నారన్న అభిప్రాయం పరిశీలకుల నుండి వ్యక్తమవుతోంది.

## 16 మంది ఐపీఎస్‌లకి కండిషనల్ జాబ్!

ఎలాంటి పోస్టింగులు ఇవ్వకుండా పక్కనపెట్టిన 16 మంది ఐపీఎస్‌లకి బాబు ప్రభుత్వం తాజాగా షాకిచ్చింది. వాళ్లంతా రోజూ డీజీపీ కార్యాలయానికి వచ్చి, హాజరు పట్టికలో సంతకం చేసి ఉదయం 10గంటల నుండి సాయంత్రం 6గంటల వరకూ ఆయన కార్యాలయంలోనే డీజీపికి అందుబాటులో ఉండాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఇది ఒక రకంగా కండిషనల్ బెయిల్ తరహాలో కండిషనల్ జాబ్. సహజంగా నేరారోపణ వున్న వారిని పోలీస్‌స్టేషన్లకి పిలిపించి ఉదయం నుండి సాయంత్రం వరకు వారిని పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టడం పోలీసు శాఖకి అలవాటు. అలాంటిది ఇప్పుడు ఏకంగా 16 మంది సీనియర్ అధికారులకి అలాంటి తరహా షరతులు ప్రభుత్వం పెట్టడం అధికారవర్గాలని విస్మయానికి గురిచేస్తోంది. రాబోయే రోజుల్లో ఇంకా ఇలాంటి ఎన్ని సంఘటనలు జరగనున్నాయో, ఎంతమంది లోపలకి వెళ్తారో రాజకీయ తెరపై వేచి చూడాల్సిందే...! "అడుసు త్రొక్కనేల ...కాలు కడుగనేల".

# ప్రజలకు మంచి చేయడమే మా లక్ష్యం

## లేగుంటపాడులో 'విపిఆర్ అమృతధార' ప్రారంభించిన విపిఆర్ దంపతులు



కోవూరు నియోజకవర్గంలోని లేగుంటపాడులో ఈనెల 14న 'విపిఆర్ అమృతధార' ప్రారంభమైంది. ప్రముఖ దాత, సేవాభూషణులు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్), ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రజలకు పరిశుభ్రమైన నీరందించి అందరి హర్షధ్వానాలందుకున్నారు. గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విపిఆర్ అమృతధార వాటర్‌ప్లాంట్‌ను వారు ప్రారంభించిన అనంతరం అత్యాధునిక హంగులతో నిర్మించిన లేగుంటపాడు గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. సిసి రోడ్డు, వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకా లను ఆవిష్కరించారు. గ్రామంలో రూ.6 లక్షలతో సిసిరోడ్డు, 38 లక్షల నిధులతో ట్యాంకు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ జెట్టి రాజగోపాలరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో విపిఆర్ మాట్లాడుతూ.. విపిఆర్ ఫౌండేషన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా దాదాపు 150 వాటర్‌ప్లాంట్లు పెట్టామని, ఒక్క కోవూరు నియోజకవర్గంలోనే ఇప్పటివరకు 18 వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. అనుకోని పరిస్థితులలో తాను ప్రత్యక్ష రాజకీయాలలోనికి వచ్చానని, తాను చేసే సేవా కార్యక్రమాలకు రాజకీయాలకు సంబంధం లేదని తెలిపారు. ప్రజలకు మంచి చేయడమే తమ లక్ష్య మన్నారు. ఎన్నికలయ్యాక తాము ప్రజలకు అందుబాటులో ఉండమని అవాకులు చెవాకులు ప్రచారం చేసిన ప్రత్యర్థులకు తమ పనితీరుతోనే సమాధానం చెబుతా మన్నారు. లేగుంటపాడు గ్రామానికి హైవేతో కనెక్టివిటీ రోడ్డుకు నిధులు సాధించి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. లేగుంటపాడు గ్రామాభి వృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న స్థానిక సర్పంచ్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి సేవలను విపిఆర్ కొనియాడారు. ప్రజలతో మమే కమై ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా పని చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్ఫూర్తితో కోవూరు నియోజకవర్గంలో కాలువల్లో పూడిక తీసేందుకు సొంత నిధులు వెచ్చించి విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రొక్లెయిన్ ఏర్పాటు చేసిన విష యాన్ని గుర్తు చేశారు. ప్రజల అవసరార్థం కొన్ని అత్యవసర పనులకు సొంత నిధులు వెచ్చించడానికి కూడా తాము వెనకాడేది లేదన్నారు. వేగూరు సర్పంచ్ అమరావతి, కోవూరు ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, టిడిపి జిల్లా కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, కోవూరు, విడవలూరు, ఇందుకూరు పేట టీడీపీ మండల అధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి, చెముకుల శ్రీనివాసులు, వీరేంద్ర నాయుడు, టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, నల్లపురెడ్డి సురేష్‌రెడ్డి, రామిరెడ్డి భానురెడ్డి, బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా పనిచేస్తేనే గ్రామాభివృద్ధి

**- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**

ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, లేగుంటపాడు గ్రామంలో వాటర్ ప్లాంట్ పెడతానన్న తన ఎన్నికల హామీని విపిఆర్ ఫౌండేషన్ ద్వారా అమలు చేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ధన్యవాదాలన్నారు. ప్రతి గ్రామంలో లేగుంటపాడు సర్పంచ్ జెట్టి రాజగోపాలరెడ్డి వంటి ప్రజా ప్రతినిధులు ఉంటే గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధించవచ్చన్నారు. గ్రామాలలో నాయకులు పార్టీలకతీతంగా పని చేస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రానున్న వర్షాకాలంలో కాలువల పూడికతో లోతట్టు ప్రాంతాలకు ముంపు వాటిల్లకుండా ఉండేందుకు 'క్లీన్ కోవూరు' పేరిట పూడికతీత కార్యక్రమం చేపట్టనున్నారు. ఆ తర్వాత, లేగుంటపాడు హైస్కూలులో వేమిరెడ్డి దంపతులు విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేశారు.

## నెల్లూరు విద్యుత్‌శాఖ సేవలు భేష్!

### 'బెస్ట్ సర్కిల్'గా అవార్డు

స్వాతంత్ర్యదినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ప్రకటించిన 'బెస్ట్ సర్కిల్' అవార్డును నెల్లూరు విద్యుత్ శాఖ సాధించింది. విద్యుత్ వినియోగదారు లకు మెరుగైన సేవలందించడంలో నెల్లూరు సర్కిల్ విద్యుత్ విభాగం రాష్ట్రం లోని ఇతర జిల్లాలకంటే ముందంజలో ఉంది. నాణ్యమైన విద్యుత్ సరఫరా, విని యోగదారులకు సేవలందించడంలో ప్రథమస్థానంలో ఉండడంతో నెల్లూరు శాఖకు ఈ అవార్డు లభించింది.

అదే విధంగా, ఉత్తమ సేవలందిస్తున్న కావలికి 'బెస్ట్ డివిజన్' అవార్డు, అతితక్కువ అంతరాయాలున్న డివిజన్‌గా నెల్లూరు రూరల్, డెవలప్‌మెంట్ చార్జీల వసూళ్ళలో నెల్లూరు డివిజన్‌లు ప్రత్యేక అవార్డులను దక్కించుకున్నాయి. విద్యుత్‌శాఖ ఎస్ఇ విజయన్ సారథ్యంలో ఈ అరుదైన అవార్డులు లభించడంతో జిల్లాలోని విద్యుత్‌శాఖ ఉద్యోగులు, సిబ్బంది, యూనియన్‌ల నాయకులు ఆయన్ను అభినందించారు.



నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలను ఇటీవల నెల్లూరులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి.

## విఆర్‌సి వాకర్స్ జెండా పండుగ



78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక నేతాజీ స్కూల్ అధినేత ఎంవి సుబ్బారెడ్డి అధ్వర్యంలో జెండాపండుగ ఘనంగా జరి గింది. నగరంలోని విఆర్‌సి గ్రౌండ్‌లో జరిగిన ఈ వేడుకలో విఆర్‌సి వాకర్స్, మహిళా వాకర్స్, పుట్ట ఎస్టేట్‌లకు చెందిన పలువురు ప్రముఖులు, వాకర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మ ఫర్ని చర్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి, జూటూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని అందరికీ స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# కూటమి ప్రభుత్వానిది హేయమైన చర్య

**రామ్‌కుమార్‌రెడ్డి నిరసన**



విజయవాడ నడిబొడ్డున డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం కిందిభాగంలో ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేరును కూటమి ప్రభుత్వం తొలగించడం దారుణమని తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అందుకు నిరసనగా ఈనెల 9న వాకాడులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ఆయన తమ నిరసన వ్యక్తంచేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అలా చేయడం మాజీ సీఎంని అవమానపరచడమే కాదు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ని అవమానించినట్లేనని ఆయన అన్నారు. విజయవాడలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించి ఆవిష్కరించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌కే చెందుతుందని, జగన్మోహన్‌రెడ్డి పేరు ఉండకూడదనే ఉద్దేశంతో రాత్రి సమయంలో లైట్లు ఆపి మరీ ఆ పేరును తొలగించారని చెప్పారు. ఇటువంటి వాటి మీద చర్య తీసుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిది కాదా అని ఆయన ప్రశ్నించారు.

## 18న..అరుణాచలంకు ప్రత్యేక బస్సు

శ్రావణమాసం పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 18న ఆత్మకూరు నుంచి అరుణచాలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక లగ్జరీ బస్సును నడుపుతామని ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కరీ మున్నిసా తెలిపారు. ఈనెల 19న పౌర్ణమి కనుక, 18వ తేది ఉదయం ఆత్మకూరు నుండి ఈ బస్సు బయలుదేరుతుందని, రానుపోను టిక్కెట్ ధర రూ.1400గా నిర్ణయించామని చెప్పారు. ఈ బస్సులో అరుణాచలం వెళ్ళేవారికి మార్గమధ్యంలో కాణిపాకం, సిరిపురం, గోల్డన్ టెంపుల్, అరుణాచలం, గిరిప్రదర్శనంతో పాటు స్వామివారి దర్శనం కూడా అందుబాటులో ఉంటాయని, ఇతర వివరాలకు డిపో మేనేజర్ 99592 25645 నంబరుకు సంప్రదించాలని కోరారు.

### కాకాణికి తెలిసింది ఒక్కటే..

# దోచుకోవడం..దాచుకోవడం

**- దుయ్యబట్టిన సోమిరెడ్డి**



మాజీమంత్రి కాకాణికి తెలిసిందొక్కటే దోచుకోవడం.. దాచుకోవడం, అడ్డంగా దొరికి పోతే బూతులు తిట్టడం' అంటూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దుయ్య బట్టారు. పొదలకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇటీవల ఏర్పాటుచేసిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, గత వైకాపా ప్రభుత్వంలో నాయకులు చేసిన అవినీతిని ఉతికి ఆరేశారు. వైకాపా హయాంలో పంచభూతాలను దోచేశారని, భూఅక్రమాలకు సర్వేపల్లి నియోజకవర్గాన్ని అడ్డాగామార్చాడని కాకాణిపై ధ్వజమెత్తారు. వారి పాలనలో వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్ శాఖలను పడుకోబెట్టేశారని, నెల్లూరుజిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఆ శాఖలకు మంత్రులుగా ప్రాతినిధ్యం వహించి నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఎంత సేపటికీ కలెక్షన్లు లెక్కపెట్టుకోవడం..టోలుగేట్లలో దండుకోవడంతో సరిపెట్టుకున్నాడని, పదవుల కోసం కాకాలు పట్టడమే పనిగా పెట్టుకున్నాడని ఆయన విమర్శించారు. తమ హయాంలో 5ఎకరాల లోపు ఉన్న రైతులకు 90శాతం సబ్సిడీతో సూక్ష్మసేద్య పరికరాలు అందజేశామని, వైకాపా పాలనలో రైతులకు ఏ పరికరం అందకుండా చేశారని విమర్శించారు. నెల్లూరులో గిరిజనుల కోసం ఐటీడీఏ సాధించామని, ప్రజలకు తాము ఏమేం చేశామో చెప్పుకునేందుకు ఎన్నో ఉన్నాయని, కాకాణికి చెప్పుకోవడానికి ఉన్నది సవిటి కాలువల మీద విగ్రహాలు నిర్మించడమొక్కటేనని ఆయన ఎద్దేవా చేశారు.

## సత్యను కలసిన సోమిరెడ్డి

రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి, పొదలకూరు పీహెచ్‌సిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషిచేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

## 3 నెలలుగా జీతాలు లేవు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాలయాల్లో ఉద్యోగులకు గత మూడు నెలలుగా జీతాలు అందలేదని, దీంతో ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని ప్రోగ్రెసివ్ రికగ్నయిజ్డ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటరాజు, తిరుమలయ్య ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా, విద్యార్థుల మెనూ ఖర్చులకు సంబంధించిన బకాయలు కూడా గత అయిదు నెలలుగా విడుదల కాకపోవడంతో, వారికి నాణ్యమైన భోజనం అందడం లేదని, ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఈ సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## టూకీగా...



### కొండ బిట్రగుంట ప్రసన్నునికి.. వేడుకగా గరుడసేవ

'గరుడపంచమి' సందర్భంగా ఇటీవల బోగోలు మండలం కొండబిట్రగుంటలో కొలువైవున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామికి నేత్రపర్వంగా గరుడసేవ నిర్వహించారు. కావలికి చెందిన అరవ రాధాకృష్ణయ్య, అరవ తులసీరామ్‌లు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తరించారు.

### కోవూరులో ఉచిత వైద్య శిబిరం

కోవూరులో ఆర్‌కె పెట్రోలు బంకు నిర్వాహకులు పేరం రవికుమార్, సురేష్‌కుమార్, సునీల్ తదితరులు ఈనెల 11న ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ ధీరజ్ ఆధ్వర్యంలో పేదలకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. పెద్దసంఖ్యలో రోగులు పాల్గొని వైద్యసేవలందుకున్నారు.

### తూర్పుచెన్నంపల్లిలో 'ఆదర్శ' సేవలు

వరికుంటపాడు మండలం తూర్పుచెన్నంపల్లిలో స్థానిక 'ఆదర్శ సేవా సంస్థ' వారు ఈనెల 13న ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించి కంటిరోగులకు వైద్యపరీక్షలు చేయించి, ఆ సంస్థ ఛైర్మెన్ బి. ఆదయ్య వితరణతో ఉచితంగా మందులిచ్చారు. సుమారు 120 మందికి పైగా రోగులు ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

### జగదేవిపేటలో పంటపొలాల పరిశీలన

ఇందుకూరుపేట మండలం జగదేవిపేటలో వ్యవసాయ శాఖ అధికారి ఏ.రాజ్‌కుమార్ ఈనెల 13న పంటపొలాలను పరిశీలించి, వరిలో కాండం తొలుచు పురుగు, ఆకుముడత తెగుళ్ళను గుర్తించారు. వాటి నివారణకు ఏ మందులు వాడాలో రైతులకు అవగాహన కలిగించారు.

### మన్నేబోయినపల్లిలో ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

లింగసముద్రం మండలంలోని మన్నేబోయినపల్లి గ్రామం వద్ద ఇటీవల పోలీసులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మన్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తీసుకుపోతున్న ఆ ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశారు.

### బూదవాడ వద్ద చెట్టును ఢీకొన్న కారు.. ఇద్దరు మృతి

మర్రిపాడు మండలం బూదవాడ వద్ద జాతీయరహదారిపై ఈనెల 12వ తేది జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొని బోల్తాపడడంతో, కారులో ఉన్న శ్రీనివాసులురెడ్డి(30), వెంకటేశ్వర్లురెడ్డి(30) దుర్మరణం పాలయ్యారు. డ్రైవింగ్ చేస్తున్న యానాదిరెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

### కొత్తూరులో హర్ ఘర్ తిరంగా

ఇందుకూరుపేట మండలం కొత్తూరులో ఈనెల 12న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహం వద్ద 'స్వచ్ఛభారత్' నిర్వహించి పరిసరాలు పరిశుభ్రం చేశారు. బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు అవినాష్‌రెడ్డి, పరంధామయ్య, శరత్, వెంకయ్య, వెంకటశేషయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

### మనుబోలులో ఉచిత దంతవైద్య సేవలు

మండల కేంద్రమైన మనుబోలులో దంత వైద్యురాలు భవాని ఈనెల 12న ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో, స్మైల్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో, దంత సమస్యలున్నవారికి వైద్యపరీక్షలు చేసి తగు సూచనలిచ్చారు. పిఆర్‌ఓ భాను, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### కరేడులో సైబర్ నేరాలపై అవగాహన

కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండలంలోని కరేడు గ్రామంలో ఈనెల 12న సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామస్తులకు సైబర్ మోసాలు ఎలా జరుగుతున్నాయో అవగాహన కలిగించారు. ఆ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎస్ఐ బాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# రక్తదానానికి యువత ముందుండాలి

**ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్**



గూడూరు పట్టణంలోని బ్రాహ్మణ భవనంలో కనుపూరు శ్రీహరి(జెమిని) జన్మదినం సందర్భంగా ఈ నెల 11వ తేదీ నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రక్తదానం చేసేందుకు పెద్దఎత్తున ముందుకు వచ్చిన యువతను అభినందించి, వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. యువతకు రక్తదానంపై అవగాహన పెంపొందించేలా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు.

## ఆలూరు దంపతుల వివాహ వేడుక



గూడూరులోని బ్రాహ్మణ సేవా సంఘ భవనంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గూడూరు శాఖ వారి ఆధ్వర్యంలో ఆలూరు శిరోమణిశర్మ 54వ వివాహ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న టూటౌన్ సీ.ఐ రవికిరణ్‌తో పాటు సంఘ ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులందరూ శిరోమణిశర్మ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వచ్చిన దంపతులు అందరికీ తాంబూలాలు ఇచ్చారు. బి.శ్రీనివాసరావు, కడివేటి రామమూర్తి, వెంకటేశ్వరరావు, నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దారుగా చంద్రశేఖర్



గూడూరు మండల తహశీల్దార్‌గా చంద్రశేఖర్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. గూడూరు మండల వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే అర్జీదారులను తిప్పుకోకుండా సత్వరమే వారి సమస్యలు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తహశీల్దార్‌ను కలిసిన విఆర్‌ఓలలో రాధాకృష్ణ, రాజేష్, చెంచయ్య, పుల్లయ్య, చంద్రశేఖర్, వెంకటేశ్వరరాజు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

**- డీఎస్పీ రమణకుమార్**



గూడూరు సబ్‌డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం పనిచేస్తూ ఉంటారని గూడూరు నూతన డీఎస్పీ వి.వి.రమణకుమార్ వెల్లడించారు. ఈనెల 11న గూడూరు సబ్‌డివిజనల్ పోలీసు కార్యాలయంలో ఆయన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలువురు సీఐలు, ఎస్సైలు, డీఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# వానలొస్తున్నాయ్... జాగ్రత్త!

- గత అనుభవాలను గుణపాఠాలుగా తీసుకోవాలి
- చేతులు కాలాక ఆకులు పట్టుకునే విధానాలు పోవాలి
- గతంలో దెబ్బతిన్న ప్రాంతాల పరిస్థితులను సమీక్షించాలి

*మరో రెండున్నర నెలలో 'నవంబర్' వచ్చేస్తోందంటేనే జిల్లా ప్రజల గుండెలు దడదడమంటున్నాయి. నవంబర్ నుంచి డిసెంబర్ దాకా నెల్లూరుజిల్లాకు ఎప్పుడూ వానగండాలు ఉంటుండడమే అందుకు కారణం. అందులోనూ డిసెంబర్ వస్తోందంటేనే ఇక ఏ మాయదారి తుఫానో వచ్చేస్తుందని లెక్క. గత అనుభవాల పాఠాలే ఇవి. గత ఏడాది కూడా డిసెంబర్‌లో 'మిచౌంగ్' తుఫాన్ నెల్లూరును నిలువునా ముంచేసింది. జిల్లాను అతలాకుతలం చేసింది. వాగులు వంకలు పొర్లిపోయి, పంటలు దెబ్బతిని జిల్లాకు కోట్లాదిరూపాయల నష్టం వాటిల్లింది. నెల్లూరు నగరాన్నంతా వాననీటి వెల్లువతో ముంచెత్తింది. మూడు రోజుల పాటు ఆ భీభత్సం అంతా ఇంతా కాదు. అందుకే నవంబర్ వస్తుందన్నా, డిసెంబర్ వచ్చేస్తోందన్నా నెల్లూరు జనం వణికిపోవాల్సి వస్తోంది. వానలొచ్చే రోజులు దగ్గరికి వచ్చేస్తున్నాయి కాబట్టి, గతంలోని పరిస్థితులు పునరావృతం కాకుండా ఇకనైనా మన పాలకులు, అధికారులు మేల్కొని ఆ విపత్తుల బారినుంచి కాపాడేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.*

2023 డిసెంబరు 3 నుంచి 5వ తేదీ దాకా తుఫాన్ జిల్లాను అల్లకల్లోలం చేసింది. కుండపోత వానలతో అనేక ప్రాంతాలు నీట మునిగాయి. వేసుకున్న పంటలు కొట్టుకుపోయాయి. నిమ్మ, మామిడి తోటలు నాశనమయ్యాయి. ఈదురుగాలులు, భారీ వానలతో అన్ని రంగాలకు అపార నష్టాలు వాటిల్లాయి. జిల్లాలో మొత్తంగా రూ.411 కోట్లకు పైగానే నష్టం వాటిల్లినట్లు అప్పట్లో అధికారులు అంచనాలు కట్టారంటే, ఆ కుంభ వృష్టి జిల్లాను ఎంతగా దెబ్బతీసిందో అర్ధమవుతుంది. పెనుగాలుల దెబ్బకు విద్యుత్ స్తంభాలు నేలకూలి, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిని ఒక్క విద్యుత్‌శాఖకే రూ.10 కోట్లకు పైగానే నష్టం వచ్చింది. ఆ గాయాల నుంచి పూర్తిగా కోలుకోకముందే, మళ్ళీ అటు తిరిగి ఇటు చూసేసరికి.. డిసెంబర్ వచ్చేస్తోంది. సముద్రం కూతవేటు దూరంలో ఉంది కాబట్టి నెల్లూరుజిల్లాకు తుఫాన్‌లు మామూలే. అయితే, ముందు జాగ్రత్తలు తీసుకోకపోతే మాత్రం నష్టాలు భారీస్థాయిలో ఉంటాయి.

## అతలాకుతలమైన జిల్లా :

గత ఏడాది ఈ వానల భీభత్సానికి జిల్లాలో ఎక్కడెక్కడ వాగులు వంకలు పొర్లిపోయి రోడ్లకు గండ్లు పడ్డాయో, ఎక్కడ ఎలాంటి నష్టాలు జరిగాయో లెక్క ఉంటుంది కనుక, ఆయా ప్రాంతాల పరిస్థితి ఇప్పుడెలా ఉందో ఒకసారి జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించాలి. అందుకు నిపుణులతో కూడిన బృందాలను నియమించి, అన్ని ప్రాంతాల నుంచి తాజా నివేదికలు తెప్పించుకోవాలి. పాత పరిస్థితులు తిరిగి తలెత్తకుండా చూడాలి. చెరువులకు పడిన గండ్లు పూడ్చారో లేదా?..కట్టలు పటిష్టంగా ఉన్నాయా లేదా తప్పనిసరిగా పరిశీలించి, ఒకవేళ అవి అప్పటినుంచి అలాగే పడివుంటే, వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలి. గ్రామీణ ప్రాంతాల్లో అప్పట్లో జరిగిన నష్టాలు లెక్కలేనన్ని. సముద్రతీర ప్రాంతాల్లో జీవిస్తున్న మత్స్యకారుల పరిస్థితి మరింత దయనీయం! ఆ కష్ట నష్టాలన్నిటినీ ఒకసారి పరిశీలించి, తీర ప్రాంతాల్లో ప్రజల రక్షణ కోసం ఉన్న తుఫాన్ షెల్టర్లు ఎలా ఉన్నాయో చూడాలి. అత్యవసర సందర్భాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏం చేయాలో ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలి.

## చెరువుగా మారుతున్న.. మాగుంట లేఅవుట్

భారీ వానలొస్తే నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్ వాసుల కష్టాలు చెప్పలేనన్ని. అక్కడున్న అండర్‌బ్రిడ్జి నీళ్ళతో నిండిపోయి, స్కూలు బస్సులు సైతం పీకలదాకా మునిగిపోయే పరిస్థితి. ఆ మురుగునీళ్ళు వెంటనే వెళ్లిపోయేందుకు ఉన్న సైడుకాలువలు ఎప్పుడూ చెత్తాచెదారాలతో నిండిపోయి ఉంటాయి. దీంతో ఆ వెల్లువంతా రోడ్లమీదకు వచ్చి, అండర్‌బ్రిడ్జి నుంచి మినీబైపాస్‌రోడ్డు దాకా ఒక పెద్ద చెరువులా తయారవుతుంది. చుట్టుపక్కలున్న ఇళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోకి నీళ్ళొచ్చేస్తాయి. గత ఏడాది డిసెంబర్‌లో మాగుంట లేఅవుట్‌ను చూస్తే, పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా ఇన్ని కష్టాల్లో అక్కడెందుకు నివాసం ఉంటున్నామా అని ప్రజలు వాపోయే దుస్థితి. అంతెందుకు, అక్కడే ఉన్న 'లాయర్' పత్రిక కార్యాలయం కూడా ఆ వెల్లువకు జలమయమైపోయింది. ఎడతెరిపిలేని వానలతో, మోకాటిలోతు నీళ్లతో అక్కడున్న ఇళ్ళు, కార్యాలయాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. మరోవైపు విద్యుత్ స్తంభాలు పడిపోయి, కరెంటు పోయి ప్రజలు నానా యాతనలు పడ్డారు. కార్పొరేషన్ అధికారులు హుటాహుటిన రంగంలోకి దిగి అండర్‌బ్రిడ్డి వద్ద ఇంజన్లు పెట్టి రోజంతా కష్టపడి ఎలాగో ఆ నీళ్ళను తోడించారు. ఆ కష్టాలను మరచిపోలేం.




మాగుంట లే అవుట్ దుస్థితి (ఫైల్‌ఫోటో)



## నగరం మరీ ఘోరం!...

గత ఏడాది డిసెంబర్‌లో మూడు రోజులు వానల దెబ్బకు నెల్లూరు మురుగు నీటి గుంటలా తయారైంది. ఎక్కడ చూసినా నీళ్ళు నిలబడిపోయాయి. పోయేందుకు దారి లేదు. భూగర్భ డ్రైనేజీ లేకపోవడం, సైడుకాలువల్లో నీటి ప్రవాహాలు రోడ్లపైకి వెల్లువలా వచ్చి, ఆ చుట్టుపక్కల జనావాసాలను దిగ్బంధం చేయడం జరిగాయి. మన్సూర్‌నగర్ వంటి ప్రాంతాలు, నగర శివారు ప్రాంతాలు నీటమునిగి ప్రజలు పడిన బాధలు వర్ణనాతీతం!.. వానలొస్తే చాలు, నెల్లూరు నగరంలోని అండర్‌బ్రిడ్జిలన్నీ నీటిప్రవాహంతో నిండిపోతుండడంతో, అటువైపు –ఇటువైపు ఉన్న దారులన్నీ జలమయమై ట్రాఫిక్ స్తంభించిపోతుంది. జనజీవనం అల్లకల్లోలంగా మారుతుంది. ఎప్పుడు పెద్ద వానలొచ్చినా నగరానికి ఈ దుస్థితి తప్పడం లేదు. ఏదేమైనా, వానలు లేని మామూలు రోజుల్లో ఆ పరిస్థితులను చక్కదిద్దితే, వానలొచ్చినప్పుడు కొంతలో కొంత ఇబ్బందులు తప్పుతాయి. ఆమేరకు అధికారులు వెంటనే చర్యలకు ఉపక్రమించాలి. లేకుంటే చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఏముంటుందీ?.. జిల్లా ఉన్నతాధికారులు, నిపుణుల బృందాలు అందరూ కలసి రానున్న విపత్తులను ముందుగానే గ్రహించి, జాగ్రత్తలు తీసుకుని ప్రజలను ఆ ముప్పుల నుంచి తప్పిస్తారని ఆశిద్దాం!.

### అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవడమంటే..

# వారి భూముల్ని స్వాహా చేయడమా?

## – టీడీపీ నేత బీద రవిచంద్ర ధ్వజం



అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవడమంటే వారి భూముల్ని స్వాహా చేసేయడమా?.. అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మాజీ మంత్రి జోగి రమేష్‌పై ప్రశ్నలవర్షం కురిపించారు. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో ఆయన కుమారుడు, బాబాయి దొరికిపోయినా, అవి టీడీపీ కక్షసాధింపు చర్యలంటూ బుకాయించడం ఏమిటని ఆయన ధ్వజమెత్తారు. అగ్రిగోల్డ్ వ్యవహారంలో జరిగిన అక్రమాలను ఇటీవల ఆయన ప్రస్తావిస్తూ, వైకాపా నేతలు ఎన్నికలకు ముందు చెప్పేది ఒకటి, అధికారంలోకి వచ్చాక చేసేది మరొకటి అన్నది స్పష్టమవుతోందని, వారి అరాచకాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటామని 2019 ఎన్నికల ప్రచారంలో వైకాపా నేతలు నమ్మించారని, అధికారంలోకి వచ్చాక అగ్రిగోల్డ్ భూములను జోగి కుటుంబ సభ్యులే స్వాహా చేశారని, అధికారాన్ని దుర్వినియోగం చేసి అగ్రిగోల్డ్ భూములను అక్రమంగా తమ కుటుంబ సభ్యులకు జోగి రమేష్ దోచిపెట్టారని ఆయన ఆరోపించారు. ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూములను జోగి కుటుంబసభ్యులు కొనుగోలుచేయడమే కాక, రికార్డులను తారుమారు చేసి, సర్వే నెంబరును సైతం మార్చివేశారని అన్నారు. జోగి కుటుంబ సభ్యుల అక్రమాలపై అగ్రిగోల్డ్ సంస్థ ఇచ్చిన ఫిర్యాదుతోనే ఏసీబీ అధికారులు రంగంలోకి దర్యాప్తు జరిపి వారిని అదుపులోకి తీసుకున్నారన్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, నచ్చిన భూములను ఆక్రమించుకోవడానికి తమదేమీ వైసీపీ ప్రభుత్వం కాదని, కూటమి ప్రభుత్వమని జోగి గుర్తించాలని ఆయన చురకంటించారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com